


నేటి నుంచి భూ విలువల సవరణలు

జిల్లాలో భూముల విలువలను సవరించనున్నారు. అర్బన్, గ్రామ కమిటీల సూచనల ఆధారంగా, ఇతర అంశాల ప్రాతిపాదికన వ్యవసాయేతర, వ్యవసాయ భూములను మూడు భాగాలుగా విభజించి ధరలు నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా భూముల ధరలు అన్నిచోట్లా 10 నుంచి 15 శాతం పెంచాలని చూస్తున్నారు. దీనిపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలు తీసుకొని అనంతరం సవరించిన రిజిస్ట్రేషన్ ధరలను ఫిబ్రవరి 1వ తేది నుంచి అమలు చేయనున్నారు. మార్కెట్ విలువకు తగ్గట్టుగానే రిజిస్ట్రేషన్ చార్జీలు సవరించి వినియోగదారులపై భారం పడకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ నిర్ణయంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం లభించనుంది.



- 10 నుంచి 15 శాతం చార్జీలు పెరిగే అవకాశం
- ధరలు పెరగనున్న నేపథ్యంలో క్రయ విక్రయదారుల రద్దీ
- కిటకిటలాడుతున్న కల్లూరు, కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

కల్లూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఆదాయార్జనే లక్ష్యంగా ఉన్న విలువకు రెండు, మూడంతల రేట్లు పెంచడంతో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. ఉమ్మడి జిల్లాలో ఆస్తులు స్థలాల క్రయవిక్రయాలు మందగించడంతో ప్రభుత్వం ఆదాయానికి భారీ గండి పడింది. రిజిస్ట్రేషన్ శాఖ లక్ష్యాన్ని చేరుకోలేక పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హెచ్చుతగ్గులను సవరించి భూవిలువలను పెంచేందుకు చర్యలు తీసుకుంది. ఈమేరకు ఫిబ్రవరి 1వ తేది నుండి ఈప్రక్రియ అమల్లోకి రానుంది.

చివరి రోజు కిటకిటలాడిన కార్యాలయాలు: ఫిబ్రవరి 1 నుండి భూ విలువల సవరణ నేపథ్యంలో చివరి రోజు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. భూముల విలువ సవరించడంతో రేట్లు పెరుగుతాయన్న ఉద్దేశంతో క్రయ విక్రయదారులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిక్కిరిసిపోయాయి. శుక్రవారం కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రజలు తరలివచ్చారు. రద్దీ పెరగడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిదానంగా సాగింది. మరోపక్క సర్వర్లు మొరాయించడంతో అధికారులు రాత్రి సమయంలోనూ పనిచేయాల్సి వచ్చింది.

ఇదిలా ఉండగా రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు నిర్ణయాన్ని వాయిదా వేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం, బిల్డర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డికి సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. నిర్మాణ రంగం సంక్షోభంలో ఉందని ఇలాంటి పరిస్థితుల్లో రిజిస్ట్రేషన్ చార్జీల పెంచడం సరైంది కాదని అన్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు వెయ్యి భవనాలు కొనేవారు లేక నిలిచిపోయాయని, టు లెట్ బోర్డులు కనిపిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డర్స్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ బ్రిజేష్‌సింగ్, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకుడు ఇరిగినేని పుల్లారెడ్డి, ఆర్‌వి. బ్రహ్మయ్య, కే. మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.


కిటకిటలాడుతున్న కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం


రిజిస్ట్రేషన్ చార్జీల పెంపును వాయిదా వేయాలని జిల్లా రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘాల నాయకులు

మల్లన్న హుండీ ఆదాయం రూ.2.59 కోట్లు

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 31(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లన్న హుండీ లెక్కింపులో రూ.2,59,68,400 ఆదాయం సమకూరింది. శుక్రవారం దేవస్థానం పరిధిలోని చంద్రావతి కళ్యాణ మంటపంలో నిర్వహించిన ఈ హుండీ లెక్కింపులో నగదుతో పాటు 64.20 గ్రాముల బంగారం, 3.17కేజీల వెండితో పాటు పలు విదేశీ కరెన్సీలు లభించాయి. ఇందులో యూఎస్‌ఏ డాలర్లు -590, చైనా యువాన్స్ -100, సౌదీ అరేబియా రియాల్స్ -5, కువైట్ దినార్స్ -2, కెనడా డాలర్లు -10, యూఏఈ దిర్హమ్స్ -1090, సింగపూర్ డాలర్లు -14, ఖత్తార్ రియాల్ -1, యూరోప్ -5, మలేసియా లింగిట్స్ -23, యూకే పౌండ్స్ -45, ఆస్ట్రేలియా డాలర్లు -240, రష్యా రూబెల్స్ 30 తదితర విదేశీ కరెన్సీ రాబడిగా వచ్చింది. కాగా ఈ ఆదాయం జనవరి 9 నుంచి 30వ తేది వరకు భక్తులు సమర్పించినట్లు దేవస్థానం ఈవో శ్రీనివాసరావు తెలిపారు. హుండీ లెక్కింపు ప్రక్రియను సీసీ కెమెరాలు, భద్రత ఏర్పాట్ల నడుమ పకడ్బందీగా చేపట్టినట్లు చెప్పారు.


హుండీ లెక్కిస్తున్న దృశ్యం

క్రీడారంగం అభివృద్ధే ధ్యేయం
శాప్ చైర్మన్ రవి నాయుడు

144

తుంగభద్ర గేట్లు ఏర్పాటుకు కసరత్తు..!
- దామాషా ప్రకారం ఏపీ, కర్ణాటక నిధులు సమకూర్చాలి
- గేట్ల సామర్థ్యంపై మరోసారి తనిఖీ
- ఢిల్లీలో సీడబ్ల్యూసీ ప్రత్యేక భేటీ

బాల్య వివాహాలను అరికట్టాలి
మహిళా శిశు, వికలాంగ వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సూర్యకుమారి, కలెక్టర్ తదితరులు

కర్నూలు కలెక్టరేట్, జనవరి 31: (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖలు బాల్య వివాహాలు అరికట్టడానికి సమన్వయంతో పని చేయాలని మహిళ, శిశు వికలాంగ వయోవృద్ధుల సంక్షేమ శాఖ సెక్రటరీ ఏ. సూర్యకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, తహసీల్దార్లు, మండల విద్యాశాఖ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు శాఖల అధికారులతో బాల్య వివాహాల నిర్మూలనపై మహిళా శిశు వికలాంగ వయోవృద్ధుల సంక్షేమ శాఖ సెక్రటరీ ఏ. సూర్యకుమారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో గత ఆరు నెలలుగా 746 బాల్య వివాహాలను నివారించామని అన్నారు. కలెక్టర్ పి. రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ ఏడాది 64 బాల్య వివాహాలను అడ్డుకున్నామని అన్నారు. కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్న 5 మండలాలైన ఆదోని, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, మంత్రాలయం, సి. బెళగల్ మండలాలను హైరిస్క్ మండలాలుగా గుర్తించామన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించేందుకు 682 గ్రామకమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, అడిషనల్ ఎస్పీ హుశేన్‌పీరా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ రోహిణి, యూనిసెఫ్ డైరెక్టర్ మురళీకృష్ణ, ఐసీడీఎస్ పీడీ నిర్మల, జడ్పీ సీఈవో నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జనవరి 31: (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును శుక్రవారం విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో టీటీడీ బోర్డు సభ్యుడు, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ కలిశారు. ఓర్వకల్లు మండలంలో వివిధ గ్రామాల్లో నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో ఉన్నారని, పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎంను కోరినట్లు మల్లెల రాజశేఖర్ తెలిపారు. త్వరలో ఓర్వకల్లులో బీటెక్, ఐటీఐ, డిప్లమా చదివిన నిరుద్యోగులు 20వేల మందితో ముఖాముఖి చర్చ జరపాలని కోరినట్లు తెలిపారు. అలాగే ఓర్వకల్లులో ఏర్పాటు చేస్తున్న కార్ల పరిశ్రమకు త్వరగా భూమి పూజ చేసి పనులు ప్రారంభించాలని సీఎం చంద్రబాబును కోరామన్నారు. ఓర్వకల్లులో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరామని ఆయన తెలిపారు. ఆయన వెంట మండల కాపు సంఘం నాయకులు కేవీ మధు, ముస్లిం మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా ఉన్నారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న మల్లెల రాజశేఖర్

నేడు ఎస్పీ బాధ్యతల స్వీకరణ

కర్నూలు క్రైం, జనవరి 31: (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఎస్పీగా విక్రాంత్ పాటిల్ శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. కాకినాడ జిల్లా నుంచి ఈయన కర్నూలుకు బదిలీపై వస్తున్నారు. ప్రస్తుత ఎస్పీ బిందుమాధవ్ కాకినాడ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

ఆకాశాన్నంటుతున్న వాము
- క్వింటం గరిష్ఠ ధర రూ.26,012
- రైతులు హర్షం


కర్నూలు మార్కెట్ యార్డుకు విక్రయానికి తెచ్చిన వాము

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో వాము ధర రోజురోజుకూ పెరుగుతోంది. వారం క్రితం క్వింటం వాము గరిష్ఠంగా రూ.23,011 ఉండగా.. శుక్రవారం రూ. 26,012కు చేరింది. ఈ ధర మరింతగా పెరిగే అవకాశం ఉందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు తెలిపారు. కర్ణాటక, అనంతపురం ప్రాంతాల నుంచి రైతులు వామును కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకువస్తున్నారు. క్వింటం వాము ధర గరిష్ఠంగా రూ.26,012, మధ్యస్థ ధర రూ.11,099, కనిష్ఠ ధర రూ.1,499కు అమ్ముడుపోయింది. వేరుశనగ కాయల ధర మాత్రం రోజురోజుకు పతనం అవుతుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం క్వింటం వేరుశనగ కాయలకు మద్దతు ధర రూ.6,720 ప్రకటించింది. శుక్రవారం క్వింటం వేరుశనగకాయల ధర కర్నూలు యార్డులో రూ.6,011కు తగ్గిపోవడంతో రైతులు ఆయిల్‌ఫెడ్ ద్వారా కొని మద్దతు ధర ఇవ్వాలని కోరుతున్నారు.

డీజీపీని కలిసిన విజిలెన్స్ ఎస్పీ

కర్నూలు క్రైం, జనవరి 31: (ఆంధ్రజ్యోతి): కొత్తగా బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను కర్నూలు విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం విజయవాడలోని డీజీపీ కార్యాలయంలో డీజీపీని కలిసి అభినందనలు తెలియజేశారు.



- రుద్రవరంలో అక్రమ బిల్లులతో రూ. 1.88 కోట్లు స్వాహా
- ఈ అక్రమాల్లో సర్పంచ్‌తో పాటు కొందరు కార్యదర్శుల పాత్ర
- తాజాగా జిల్లా యంత్రాంగానికి నివేదిక అందజేత
- అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారా..?
- నగదు రికవరీ చేస్తారా..?
- రుద్రవరం మేజర్ పంచాయతీలో హెచ్చుమీరిన అవినీతి


రుద్రవరం మేజర్ పంచాయతీ కార్యాలయం (పాత భవనం)

ఏకమై కాజేశారు...!




ఆళ్లగడ్డ నియోజకవర్గం పరిధిలోని రుద్రవరం మేజర్ పంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాలు విస్తుగొలుపుతున్నాయి. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్‌కు వచ్చిన ఫిర్యాదుతో జరిగిన విచారణలో అసలు విషయాలు బయటకు వచ్చాయి. దీంతో రుద్రవరం మేజర్ పంచాయతీలో జరిగిన అవినీతితో పాటు, సర్పంచ్ బైరి విజయలక్ష్మిపై వస్తున్న అవినీతి ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి ఇటీవల అధికారులను ఆదేశించారు. దీంతో నంద్యాల డీపీఓ షేక్ జమీఉల్లా రంగంలోకి డీఎల్‌పీఓ రాంబాబును విచారణ అధికారిగా నియమించారు. విచారణ వేగవంతం చేయడంతో సదరు పంచాయతీలోని అవినీతి అక్రమాల గుట్టు రట్టయింది. మొత్తంగా గత వైసీపీ సర్కార్ అండదండలతో తమ సర్పంచ్ పదవిని అడ్డుగా పెట్టుకుని.. గత నాలుగేళ్ల కాలంలో ఆయా సమయాల్లో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులతో కుమ్మక్కై సదరు సర్పంచ్, వైసీపీ నాయకులు ఫేక్ బిల్లులు సృష్టించి రూ.1.88 కోట్లు ప్రజాధనం కాజేసినట్లు విచారణలో వెల్లడైంది. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల వెనుక వైసీపీ నాయకులు దగ్గరుండి ఇలాంటి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నంద్యాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలోని రుద్రవరం మేజర్ పంచాయతీలో అవినీతి అక్రమాలు జోరందుకున్నాయి. జనరల్ నిధుల నుంచి పశువుల సంత, దినసరి మార్కెట్ వేలం ఇతరత్రా పనులు గత నాలుగేళ్లలో అవినీతిమయమయ్యాయి. పంచాయతీ సర్పంచ్‌తో పాటు కొందరు కార్యదర్శులు కలిసి పనులు చేయకుండా చేసినట్లు రికార్డులు సృష్టించారు. మోటర్ల మరమ్మతులు కాకపోయినా చేసినట్లు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయకపోయినా చేసినట్లు.. ఇలా పలు రూపాల్లో దోపిడికి పాల్పడి రూ.కోట్లలో సొమ్ము చేసుకున్నారు. ఈ తరుణంలో సదరు పంచాయతీకి చెందిన కొందరు వార్డు సభ్యులు, ప్రజలు కలిసి గత ఏడాది డిసెంబరు 2వ తేదిన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ డీపీఓతో కలసి డీఎల్‌పీఓ రాంబాబును విచారణ అధికారిగా నియమించారు.

డీఎల్‌పీఓ విచారణతో వెలుగులోకి అవినీతి

డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) 20.12.24వ తేదిన రుద్రవరం మేజర్ పంచాయతీలో విచారణ చేపట్టారు. సుమారు 40 రోజులు పాటు లోతుగా విచారణ చేయడంతో అవినీతి అక్రమాలకు చెందిన పలు కీలక అంశాలు వెలుగు చూశాయి. కనీసం రికార్డులు నమోదు, రిజిస్టర్ల నిర్వాహణ, వస్తువుల ఎంట్రీ తదితర వివరాలు లేకపోవడాన్ని గుర్తించారు. ఇదే తరుణంలో వచ్చిన ఫిర్యాదులో భాగంగా 10 అంశాలపై లోతుగా విచారణ చేయడంతో గత నాలుగేళ్లలో రూ.1,88,35,330 నగదును అక్రమంగా కాజేసినట్లు గుర్తించారు. అందుకు సంబంధించి తగిన సమగ్ర నివేదికను తాజాగా కలెక్టర్‌కు అందజేసినట్లు సమాచారం. మొత్తంగా రుద్రవరం మేజర్ పంచాయతీలో కీలక అధికారి విచారణతో అవినీతి వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.


విచారణ నివేదికలోని ధ్రువపత్రాలు


సర్పంచ్‌కు సహకరించిన కార్యదర్శులు

రుద్రవరం పంచాయతీలో నాలుగేళ్లలో జరిగిన అవినీతి, అక్రమాల్లో సర్పంచ్‌తో పాటు పలువురు కార్యదర్శుల పాత్ర కూడా ఉన్నట్లు విచారణలో తేలింది. ఆయా సమయాల్లో సదరు పంచాయతీలో పనిచేసిన కార్యదర్శులు సుబ్బరాయుడు, ఎస్.భాగ్యలక్ష్మి, అక్తర్ మొహమ్మద్‌రఫీ, పట్నం చెన్నయ్య, ప్రస్తుత వెంకట సుబ్బరాయుడు, సర్పంచ్ బైరి విజయలక్ష్మి ఉన్నట్లు నివేదికలో కలెక్టర్‌కు తెలియజేశారు. ఏది ఏమైనా విచారణలో సదరు పంచాయతీ అవినీతి, అక్రమాలు వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది.

మిగతా 4వ పేజీలో

తుంగభద్ర గేట్ల ఏర్పాటుకు కసరత్తు..!

- దామాషా ప్రకారం ఏపీ, కర్ణాటక నిధులు సమకూర్చాలి
- గేట్ల సామర్థ్యంపై మరోసారి తనిఖీ
- ఢిల్లీలో సీడబ్ల్యూసీ ప్రత్యేక భేటీ
- హాజరైన టీబీపీ బోర్డు చైర్మన్, సెక్రెటరీ, రాష్ట్రాల సభ్యులు



కర్నూలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్లు ఏర్పాటుపై కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) దృష్టి సారించింది. శుక్రవారం ఢిల్లీలో టీబీపీ బోర్డు చైర్మన్ పాండే, సెక్రెటరీ ఓ.రామకృష్ణారెడ్డి సహా ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జలవనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సాయిప్రసాద్, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు హాజరయ్యారు. తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్లను మార్చాల్సిందేనని సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన నిపుణుల కమిటీ గతేడాది సెప్టంబరులో ఇచ్చిన నివేదికలో స్పష్టంగా పేర్కొంది. రాయలసీమ జిల్లాలు కర్నూలు, అనంతపురం, కడప సహా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు జీవనాడి తుంగభద్ర జలాశయం 1953లో నిర్మాణం పూర్తి చేశారు. తుంగభద్ర ప్రాజెక్టు (టీబీపీ) బోర్డు పర్యవేక్షణలో ఉంది. గతేడాది ఆగస్టు 10న చైన్‌లింక్ తెగిపోయి 19వ నంబరు గేటు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. 33 క్రస్ట్‌గేట్లు ఉంటే.. 70 ఏళ్ల తర్వాత ఓ గేటు కొట్టుకుపోవడంతో డ్యాం భద్రతపై సందేహాలు తలెత్తాయి. క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు నాయకత్వంలో స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ ఏర్పాటు చేశారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ చైర్మన్‌గా, హైడ్రో-మెకానికల్, ఎలక్ట్రికల్ సిస్టమ్స్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్ ఢిల్లీకి చెందిన హర్కేశ్‌కుమార్, కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన తారాపురం సుధాకర్, ఆంధ్రప్రదేశ్ సీడీవో సీఈ నాగరాజు, తెలంగాణ రాష్ట్రం సీడీవో ఈఈ బాలమురళీకృష్ణ, డ్యాం సేఫ్టీ రిటైర్డు ఎస్ఈ సుధాకర్, కర్ణాటక రాష్ట్రం టెక్నికల్ అడ్వైజరీ కమిటీ రిటైర్డు సెక్రెటరీ సిద్దరంగప్ప సభ్యులుగా ఉన్న నిపుణుల కమిటీ గతేడాది సెప్టెంబరులో డ్యాం, గేట్లను క్షుణంగా పరిశీలించి మొత్తం గేట్లను మార్చాలని నివేదిక ఇచ్చింది.

ఏపీ, కర్ణాటక దామాషా ప్రకారం నిధులు ఇవ్వాలి:

తుంగభద్ర డ్యాం 33 క్రస్ట్‌గేట్లు గేట్ల నిర్వహణలో కీలకమైన హాయిస్ట్ మెకానిజం, రోప్స్ లేటెస్ట్ డిజైన్‌తో ఏర్పాటు చేసేందుకు నిపుణులతో అధ్యయనం చేయించాలని, భారీ ప్రాజెక్టు కావడంతో జలాశయం పటిష్టత (డ్యాం హెల్త్ కండీషన్)పై పూర్తిస్థాయిలో సంబంధిత నిపుణులతో స్టడీ చేయించాలని బజాజ్ కమిటీ సూచించింది. ఈ మేరకు కొత్త గేట్లు ఏర్పాటుకు ముందు మరోసారి నిపుణులతో ప్రస్తుతం ఉన్న గేట్లు సామర్థ్యంపై అధ్యయనం చేయించాలని ఢిల్లీ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. అయితే కొత్త గేట్ల ఏర్పాటుకు అవసరమైన నిధులు సమీకరణ కోసం రుణం తీసుకోవాలని, డ్యాం రిహ్యాబిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (డ్రిప్)-2 కింద కేంద్ర నిధులు అడగాలని కర్ణాటక ప్రతిపాదించినట్లు తెలిసింది. అయితే ఒకేసారి 33 గేట్లు మార్చడం కష్టతరం కాబట్టి.. ఏటేటా ఎన్ని గేట్లు మారుస్తున్నామో అందుకు అవసరమైన నిధులు ఏపీ, కర్ణాటక రాష్ట్రాలు దామాషా ప్రకారం కేటాయించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ వేసవిలో కొట్టుకుపోయిన 19వ నంబరు గేటు స్థానంలో ఒక్కటే కొత్త గేట్లు ఏర్పాటు చేస్తారా..? మిగిలిన గేట్ల పనులు కూడా మొదలు పెడతారా..? స్పష్టత లేదు. ఏకే బజాజ్ కమిటీ సూచించిన మేరకు ఉన్న గేట్లు తొలగించి కొత్త గేట్లు ఏర్పాటుకు ముందు వాటి సామర్థ్యంపై తప్పకుండా సంబంధిత నిపుణులతో స్టడీ చేయించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది.



గత ఏడాది సెప్టెంబరులో తుంగభద్ర డ్యాంను పరిశీలించిన సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బాజాజ్ కమిటీ సభ్యులు

మాట నిలుపుకున్న సీఎం

- కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినం నిర్వహించినందుకు కృతజ్ఞతలు
- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి



కన్యాకా పరమేశ్వరి పూజల్లో కుడా చైర్మన్

కర్నూలు అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఆర్యవైశ్యులకు ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చారని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి అన్నారు. శుక్రవారం నగరంలోని కన్యాకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినం అధికారికంగా నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ రాజ్య సభ సభ్యుడు టీజీ వెంకటేష్‌తో కలిసి కర్నూలు, కల్లూరు అమ్మవారిశాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆర్యవైశ్యులను చిన్న చూపు చూశారని అన్నారు. చంద్రబాబు ఆర్యవైశ్యులకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. ఎన్నికల ముందుకు హైకోర్టు బెంచ్‌ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీకి తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి ఉండటంతో ప్రజలు చంద్రబాబుపై భరోసా పెట్టుకున్నారని అన్నారు.

మాకు మిగిలింది దు:ఖమేనా?

- పెన్నా సిమెంట్‌కు భూములిచ్చిన రైతుల ఆవేదన
- న్యాయం చేయాలని ధర్నా



పెన్నా రహదారిలో ధర్నా నిర్వహిస్తున్న రైతులు

కొలిమిగుండ్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమ కోసం జీవనాధారమైన భూములిచ్చిన తమకు చివరకు మిగిలింది దుఃఖమేనా? అని రైతులు ఆవేదన వ్యక్తం చేసున్నారు. కొలిమిగుండ్ల మండలంలోని కోరుమానుపల్లె సమీపంలో లభించే ముడి ఖనిజం ఆధారంగా సరిహద్దులోని తాడిపత్రి మండలంలో పెన్నా సిమెంట్ పరిశ్రమను 1999లో నిర్మించారు. ఇందు కోసం మండలంలోని ఉమ్మాయిపల్లె, కోరుమానుపల్లె, అబ్దులాపురం, తోళ్లమడుగు గ్రామాల నుండి గత 25 ఏళ్ల క్రితం సుమారు 800 ఎకరాలు భూములు సేకరించారు. అయితే భూములు కోల్పోయిన రైతులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. మరోవైపు ఇటీవలే ఒక ఏడాది క్రితం పెన్నా సిమెంట్ పరిశ్రమను ఆదాని గ్రూప్ టేకోవర్ చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం మండలంలోని ఉమ్మాయిపల్లె, ఉమ్మాయిపల్లె తండాకు చెందిన సుమారు 70మంది రైతులు కోరుమానుపల్లె సమీపంలోని పెన్నా సిమెంట్ మైనింగ్ రహదారిలో ధర్నాకు దిగారు. వాహనాల రాకపోకలను అడ్డుకొని నిరసన తెలిపారు. గ్రామ సర్పంచ్ ఆదినారాయణ రెడ్డితో గోపాల్‌రెడ్డి, కంబయ్య, గంగశేఖర్ యాదవ్, చిన్న నాగిరెడ్డి, రాముసాయక్, కిశోర్‌నాయక్, కత్తి నాగిరెడ్డి తదితరులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు లేక, ఉపాధి లేక తమ పిల్లలు బయట రాష్ట్రాల్లో బతుకు దెరువు సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామ పరిధిలో 350 ఎకరాల విలువైన భూములు పరిశ్రమ కోసం కోల్పోయామన్నారు. ప్రభుత్వం, పరిశ్రమ యాజమాన్యం స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పోలీసుల జోక్యంతో ధర్నా విరమణ

రైతులు ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న సీఐ రమేష్‌బాబు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రాకపోకలను అడ్డుకోవడం తగదని అన్నారు. పరిశ్రమ ప్రతినిధులతో రైతులను మాట్లాడించారు. వారం రోజుల్లో భూములు కోల్పోయిన రైతుల వద్దకు వచ్చి వివరాలు సేకరించి, యాజమాన్యానికి తెలియజేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



రైతులతో చర్చిస్తున్న పరిశ్రమ ప్రతినిధులు, సీఐ రమేష్‌బాబు

ఏకమై కాజేశారు..!



ప్రస్తుత రుద్రవరం పంచాయతీ సచివాలయం

(3వ పేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటారా?

రుద్రవరం పంచాయతీలో జరిగిన అవినీతిపై తీగ లాగితే డొంక కదిలింది. విచారణ అధికారి కూడా లోతుగా విచారణ చేసి రూ.1.88 కోట్లు ప్రజా ధనం దుర్వినియోగం అయినట్లు తగిన ఆధారాలతో నివేదికను కలెక్టర్‌కు అందజేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అవినీతిలో భాగస్వాములైన వారిపై జిల్లా కలెక్టర్ ఏ మేరకు చర్యలు తీసుకుంటారోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. అధికారులను సస్పెండ్‌తో సరిపెడతారా? లేక సర్పంచ్‌తో పాటు వీరందరిపై కేసులు నమోదు దిశగా చర్యలుతీసుకుంటారా? అక్రమాల పరంగా తేలిన నగదును రికవరీ చేసి అక్రమార్కులను వదిలేస్తారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తక్షణమే సదరు సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయకపోతే భవిష్యత్‌లో కూడా మరింత అవినీతి అక్రమాలు జరిగే అవకాశం లేకపోలేదు. రుద్రవరం మేజర్ పంచాయతీలోనే రూ.కోట్లలో అక్రమాలు జరిగితే మిగిలిన పంచాయతీలపై కూడా కలెక్టర్ దృష్టి సారించి విచారణ చేపడితే మరిన్ని వ్యవహారాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

విచారణ పూర్తి అయింది

రుద్రవరం మేజర్ పంచాయతీలో అక్రమాల అభియోగాలపై డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ నివేదిక పూర్తి అయింది. నివేదిక కూడా అందజేశారు. కాకపోతే మరోసారి పూర్తి స్థాయిలో విచారణ చేయమని ఆదేశించాం. తగిన నివేదిక మరింత సమగ్రంగా ఉండేలా ఆదేశించాం. త్వరలోనే జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయి నివేదిక అందజేస్తాం.

\- షేక్ జమీవుల్లా, డీపీఓ, నంద్యాల జిల్లా

- గ్రామ పంచాయతీ సాధారణ నిధులు (14, 15 ఫైనాన్స్) కింద 01.04.2021 నుంచి 31.03.2025 వరకు 40 రకాల పనులకు సంబంధించి కొన్నింటిలో పెట్టిన బిల్లులు పరంగా.. డ్రా చేసిన నగదుకు సంబంధించి ఎలాంటి తీర్మానాలు లేకుండా, ఫేక్ బిల్లులు సృష్టించారు. సర్పంచ్, కార్యదర్శులు కనీస నిబంధనలు పాటించలేదని తేలింది. మొత్తం మీద రూ.71,04,621ను దుర్వినియోగం చేసినట్లు తేలింది.
- జూలై 2021 నుంచి జూలై 2022వరకు జరిగిన పంచాయతీ అజెండా పరంగా పంచాయతీ కార్యదర్శి సుబ్బరాయుడు ఉన్నారు. కానీ ఆయా తీర్మానాల రిజిస్టర్లు, స్టాక్ రిజిస్టర్ కూడా మెయింటైన్స్ చేయలేదు. తనిఖీల సమయంలో కొన్ని వస్తువులకు సంబంధించి స్టార్ రిజిస్టర్‌తో పాటు పాత మెటీరియల్‌కు సంబంధించిన స్టాక్ రిజిస్టర్ చూపించకపోవడం గమనార్హం. వీటితో పాటు 01.04.2023 నుంచి 31.03.2024 వరకు జరిగిన 24 అజెండాల పరంగా.. కొన్నింటిలో 2022-23, 2023-24 కింద నిధులు డ్రా చేయడానికి ముందుగా తీర్మానాలు చేసి ఆయా సంబంధిత పనులు చేసిన తరువాత ఎంబీ చేసుకోవాలి. కానీ పై పనులకు సంబంధించి ఎలాంటి తీర్మానాలు, ఎంబీ కానీ నమోదు చేయలేదు. కొన్ని బిల్స్ పరంగా చూస్తే.. కొన్ని ఫేక్ బిల్లులుగా అనుమానం రావడంతో వెంటనే సదరు విచారణ అధికారి ఆయా బిల్లులకు సంబంధించిన వారికి ఫోన్ చేయగా తమకు చెందినవి కాదని.. ఫేక్ బిల్లులని నిర్ధారణ చేశారు. పోనీ ఆయా బిల్లులకు సంబంధించి వస్తువుల విషయంలో ఎప్పటికప్పుడు పంచాయతీ స్టాక్ రిజిస్టర్‌లో ఎంట్రీ చేసుకుని వినియోగించుకున్నారా? అంటే అదీ లేదు. మొత్తం మీద రూ.1,11,34,909 నగదు దుర్వినియోగమైనట్లు విచారణ అధికారులు గుర్తించారు.
- 2021-2024 వరకు కబేళా, వారంతపు సంతలు, దినసరి మార్కెట్ వేలం పాటల ద్వారా వచ్చిన నిధుల్లో వ్యత్యాలు ఉన్నాయి. మొత్తంగా రూ.32,56,900 రాగా రూ.26,97,100 మాత్రమే జమ చేసినట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. మిగిలిన రూ.5,95,800 నగదును రికవరీ చేయాల్సి ఉంది.

క్రీడారంగం అభివృద్ధే ధ్యేయం

- శాప్ చైర్మన్ రవి నాయుడు
- అభివృద్ధి, సంక్షేమాల్లో ముందుకు పోతున్న ప్రభుత్వం
- ఎమ్మెల్యే అఖిలప్రియ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, శాప్ చైర్మన్ రవి నాయుడు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 31(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడారంగాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని శాప్(ఏపీ స్పోర్ట్స్ అథారిటీ) చైర్మన్ అనిమిని రవి నాయుడు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిభ కలిగిన క్రీడాకారులు గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయికి వెళ్లేలా తీర్చిదిద్దుతామని అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోని ఇండోర్ స్టేడియాన్ని, భూమా బాలిరెడ్డి ఇండోర్ స్టేడియాన్ని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి ఆయన పరిశీలించారు. 2018లో మంత్రి హోదాలో భూమా అఖిలప్రియ రూ.2 కోట్లతో ఆళ్లగడ్డలో క్రీడా వికాస కేంద్రం నిర్మాణ పనులు చేపట్టగా.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పనులను నిలిపివేసిందన్నారు. ఇప్పుడు ఆ స్టేడియం పనులు పూర్తిచేస్తామని అన్నారు. రాష్ట్రంలో వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిన మాజీ సీఎం జగన్ ఇంటి ముందు విద్యార్థులు ఆందోళన చేయాలి అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అఖిలప్రియ మాట్లాడుతూ అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను గత వైసీపీ ప్రభుత్వం అప్పుల రాష్ట్రంగా మార్చిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెలల వ్యవధిలోనే సంక్షేమం, అభివృద్ధి ద్వారా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందన్నారు. ఆళ్లగడ్డలో అవినీతి జరుగుతోందని వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలపై వారి ఇళ్ల వద్దనే చర్చకు సిద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నాయబ్ రసూల్, హుసేన్ బాషా, శ్రీవిద్య, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మైలేరి మల్లయ్య పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు

- ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై దాడులు
- నాలుగు వాహనాలకు రూ.50వేల చొప్పున జరిమానా
- నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు - విజిలెన్స్ సీఐ పవన్ కిశోర్

నంద్యాల క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో, మండలంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు చేశారు. నంద్యాల మండలంలోని పలు పత్తి విత్తన శుద్ధి కేంద్రాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ పవన్‌కిశోర్, విజిలెన్స్ వ్యవసాయ అధికారి విశ్వనాథ్, నంద్యాల సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజశేఖర్, నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు భవ్యసీడ్స్, శ్రీభారతి, ఆర్కే ఆగ్రో ఇండస్ట్రీస్‌లలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌టీ కాటన్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ టెస్ట్‌లలో హెచ్‌టీ కాటన్ టెస్ట్ నెగెటివ్‌గా వచ్చినట్లు నిర్ధారించారు. అలాగే విత్తన శుద్ధి కేంద్రాలు నిర్వహిస్తున్న రిజిస్టరును తనిఖీ చేశారు. విత్తనశుద్ధి కేంద్రాల యజమానులు విత్తన చట్టం-1996ను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు డి. రాజశేఖర్ మాట్లాడుతూ విత్తనశుద్ధి కేంద్రం యజమానులు ప్రభుత్వం ద్వారా అనుమతి పొందిన విత్తనాలనే శుద్ధి చేయాలన్నారు. అలా కాదని వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలకు జరిమానా :

నంద్యాల పట్టణంలో పలు చోట్ల అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలను గుర్తించి జరిమానా విధించినట్లు విజిలెన్స్ సీఐ పవన్‌కిశోర్ తెలిపారు. నూనెపల్లె జంక్షన్, అయ్యలూరు, రైతునగరంతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో అధిక లోడ్‌తో వెళ్తున్న కంకర లారీలతోపాటు ఇతర వాహనాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడ్‌తో వెళ్తున్న నాలుగు వాహనాలను గుర్తించి ఒక్కొక్క వాహనానికి రూ.50వేల చొప్పున జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు

రెగు ఛాంపియన్ మణిపూర్



ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనాన్ని చూస్తున్న క్రీడాకారులు

నంద్యాల వైద్యం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో జరుగుతున్న 28వ జాతీయ జూనియర్ సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్ పోటీల్లో రెగు విభాగంలో మణిపూర్ బాల, బాలికల జట్లు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. బాలుర తుది పోరులో మణిపూర్ జట్టు నాగాలాండ్ జట్టుపై 2-0పాయింట్ల ఆధిక్యంతో విజయం సాధించింది. నాగాలాండ్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో మణిపూర్ జట్టు కేరళ జట్టుపై 2-0 పాయింట్ల తేడాతో గెలిచి చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. కేరళ జట్టు ద్వితీయ స్థానం దక్కించుకుంది. అంతకు ముందు రెగు బాలుర క్వార్టర్ ఫైనల్ పోటీల్లో మణిపూర్ జట్టు మహారాష్ట్ర జట్టుపై 2-0, బీహార్ జట్టు తమిళనాడు జట్టుపై 2-0, ఢిల్లీ జట్టు ఉత్తరప్రదేశ్ జట్టుపై 2-1, నాగాలాండ్ జట్టు ఒరిస్సా జట్టుపై 2-0 ఆధిక్యంతో గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. సెమీ ఫైనల్ పోటీల్లో మణిపూర్ జట్టు ఢిల్లీ జట్టుపై 2-0, నాగాలాండ్ జట్టు బీహార్ జట్టుపై 2-0పాయింట్ల ఆధిక్యంతో గెలుపొంది ఫైనల్‌కు చేరాయి. బాలికల రెగు పోటీల్లో క్వార్టర్ ఫైనల్స్‌లో హర్యానా జట్టు రాజస్థాన్ జట్టుపై 2-0, ఆంధ్రప్రదేశ్ జట్టు ఢిల్లీ జట్టుపై 2-0, మణిపూర్ జట్టు బీహార్ జట్టుపై 2-0, కేరళ జట్టు ఒరిస్సా జట్టుపై 2-1 ఆధిక్యంతో గెలిచి సెమీ ఫైనల్‌కు చేరాయి. సెమీ ఫైనల్ పోటీల్లో మణిపూర్ జట్టు హర్యానా జట్టుపై 2-0, కేరళ జట్టు ఆంధ్రప్రదేశ్ జట్టుపై 2-0పాయింట్ల ఆధిక్యంతో ఫైనల్‌కు చేరుకున్నట్లు రాష్ట్ర సెపక్‌తక్రా సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

ద్వితీయ స్థానంలో నాగాలాండ్, కేరళ జట్లు



బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ విజేతలు మణిపూర్, నాగాలాండ్ జట్లు

జాతీయ చాంపియన్ షిప్‌లో ఆంధ్రజ్యోతి రెపరెపలు

నంద్యాలలో జరుగుతున్న జాతీయ సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్ పోటీల్లో శుక్రవారం ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనాన్ని క్రీడాకారులు ఆసక్తిగా చదివారు. పత్రికలో వచ్చిన కథనానికి క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ జాతీయ స్థాయి పోటీలు నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో జరుగుతున్నాయి. మరో రెండు రోజులపాటు ఈ పోటీలు జరగనున్నట్లు నిర్వాహక కార్యదర్శి నిమ్మకాయల సుధాకర్ తెలిపారు.



తలపడుతున్న నాగాలాండ్, ఒరిస్సా జట్లు



ఆశలన్నీ ఆమె వైపే..

- రైల్వే కోచ్ పరిశ్రమకు రూ.200 కోట్లు కావాలి
- ఓర్వకల్లు ఇండస్ట్రియల్ అభివృద్ధికి మరిన్ని నిధులు
- దూపాడు-ఓర్వకల్లు రైలు మార్గానికి మోక్షం లభించేనా?
- కలగానే మంత్రాలయం-కర్నూలు రైల్వేలైన్
- కర్నూలు నుంచి విశాఖకు రైళ్లు నడపాలి
- ట్రిపుల్ ఐటీడీఎం కాలేజీకి రూ.378 కోట్లు ఇవ్వాలి
- నేడు కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

కర్నూలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):

గతేడాది టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరాక జూలై 23 ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కందనవోలు కరువు తీర్చేలా ఓర్వకల్లు పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేశారు. అదే తరహాలో శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే 2025-26 కేంద్ర బడ్జెట్‌లోనూ జిల్లా ప్రాజెక్టులు, విద్యా సంస్థలు, పరిశ్రమలకు సముచిత స్థానం కల్పించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. దశాబ్దకాలంగా సాగుతున్న రైల్వే కోచ్ పరిశ్రమ పూర్తికి రూ.200 కోట్లు ఇవ్వాలి. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధికి రూ.2,880 కోట్లతో ప్రణాళిక తయారు చేశారు. బడ్జెట్‌లో నిధులు ఇవ్వాలి. ట్రిపుల్ఐటీడీఎం కాలేజీకి రూ.378 కోట్లు నిధులు ఇవ్వాలి. పశ్చిమ ప్రాంతం ప్రజలు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న మంత్రాలయం-కర్నూలు వయా ఎమ్మిగనూరు నూతన రైల్వేలైన్ కల సాకారం దిశగా అడుగులు పడాలి. నేడు ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌లో కందనవోలుకు కేటాయింపులపై నిర్మల మనసు చాటాలని వివిధ వర్గాల ప్రజలు గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.

రైల్వే కోచ్‌కు రూ.200 కోట్లు అవసరం

కర్నూలు రూరల్ మండలం పంచలింగాల సమీపంలో రైల్వే కోచ్ మిడ్ - లైఫ్ రిహాబిలిటేషన్ వర్క్ షాప్ (ఎంఎల్ఆర్)ను 2013-14లో రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి రైల్వే కోచ్ పునరుద్ధరణ పరిశ్రమ తీసుకురావడంలో అప్పటి రైల్వే సహాయ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి కృషి ఉంది. పంచాలింగాల గ్రామం వద్ద 142 ఎకరాల్లో రూ.110 కోట్లతో నిర్మాణం చేపట్టే యూనిట్ నిర్మాణం పనులు దశాబ్దకాలంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే దాదాపుగా రూ.340 కోట్లు ఖర్చు చేసి 80 శాతం పనులు పూర్తి



చేశారు. ఈ ఏడాది డిసెంబరులో ప్రారంభించేలా రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ వర్క్‌షాప్ ప్రారంభమైతే 3 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుంది. ఈ పరిశ్రమను పూర్తి చేయడానికి సుమారు రూ.200 కోట్లు నిధులు అవసరమని అంచనా. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలమ్మ అవసరమైన నిధులు కేటాయించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. అదే క్రమంలో సీఎం చంద్రబాబు ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఏడాది పరిశ్రమను ప్రారంభించేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారు. అలాగే ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఈ వర్క్‌షాప్‌లో పని చేసే ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది పిల్లల విద్యాభ్యాసం కోసం 5 ఎకరాల్లో కేంద్ర విద్యాలయం నిర్మాణం కోసం కూడా నిధులు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ట్రిపుల్ ఐటీడీఎంకి రూ.378 కోట్లు

రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా కర్నూలు నగరంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫాక్చరింగ్ (ట్రిపుల్ ఐటీడీఎం) కేంద్రం మంజూరు చేసింది. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం జగన్నాథగట్టుపై 152 ఎకరాల భూమిని కేటాయించింది. రూ.296 కోట్లతో ట్రిపుల్ ఐటీడీఎం కాలేజీ క్యాంపస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 16 తరగతి భవనాలు, 22 ల్యాబ్స్, లైబ్రరీలు, మూడు సెమినార్ హాల్స్, మల్టీపర్పస్ హాల్, కంప్యూటర్ ల్యాబ్, రెండు మెస్ బ్లాకులు, డైరెక్టర్ బంగ్లా, 20 ఫ్యాకల్టీ క్వార్టర్స్, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ వంటివి నిర్మించారు. 2018 జూలై నుంచి కర్నూలు క్యాంపస్ కేంద్రంగా కళాశాల కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కాలేజీ విస్తరణలో భాగంగా డ్రోన్ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్, కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ల్యాబ్, మెకానికల్ ల్యాబ్ వంటి వాటికి రూ.52 కోట్లు, ఈ విద్యా సంస్థ నిర్వహణ, ఉద్యోగుల జీతాలు వంటి వాటి కోసం రూ.26.49 కోట్లు కలిపి రూ.78.49 కోట్లు అవసరం ఉందని ప్రతిపాదన పంపారు. అలాగే 80 స్టాఫ్ క్వార్టర్స్ అదనపు ల్యాబ్స్, కాన్ఫరెన్స్ హాల్, క్రికెట్ గ్రౌండ్, ఆసుపత్రి నిర్మాణం.. వంటి వాటి కోసం మరో రూ.300 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదన పంపారు.

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ అభివృద్ధికి...

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ ఏర్పాటు చేస్తామని జూలై 23న ప్రవేశ పెట్టిన 2024-25 బడ్జెట్‌లో ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించారు. హైదరాబాదు-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా 'ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్' అభివృద్ధి చేస్తామని బడ్జెట్ ప్రసంగంలో స్పష్టంగా వెల్లడించారు. 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా ఫేజ్-1 కింద 2,621 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నాన్ మెటలిక్ మినరల్ పరిశ్రమలు, ఆటోమొబైల్ రంగం విడిభాగాల తయారీ, పునరుత్పాదక పరిశ్రమలు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ పరికరాలు, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ హార్డ్‌వేర్, ఫార్మాస్యూటికల్స్, వజ్రాలు, బంగారు అభరాలు తయారీ, వస్త్ర ఉత్పత్తి రంగ పరిశ్రమల ఏర్పాటుకు రూ.12 వేల కోట్లు పెట్టుబడులు వస్తాయని నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) అంచనా వేసింది. తద్వారా 45,071 మంది యువతకు ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయి. మౌలిక వసతుల కల్పనకు అవసరమైన కోసం రూ.2,786 కోట్లు నేటి బడ్జెట్‌లో ప్రవేశపెట్టాలని మేధావులు కోరుతున్నారు.

మంత్రాలయం-కర్నూలు రైల్వేలైన్‌కు మోక్షం లభించేనా..?

మంత్రాలయం-కర్నూలు వయా ఎమ్మిగనూరు నూతన రైల్వేలైన్ పశ్చిమ ప్రాంత ప్రజల దశాబ్దాల స్వప్నం. 48 ఏళ్ల క్రితం ఎమ్మిగనూరుకు చెందిన అప్పటి ఎంపీ వై.గాదిలింగన్నగౌడ్ పార్లమెంట్‌లో గళమెత్తారు. ఆ తరువాత మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి కూడా ఎంపీగా ఉన్న సమయంలో పార్లమెంట్‌లో ప్రతిపాదించారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులు ట్రాఫిక్ సర్వే చేసి నివేదిక ఇచ్చారు. ఈ నివేదిక ఆధారంగా 2004 బడ్జెట్‌లో రూ.166 కోట్లు కేటాయింపులు చేశారు. డీపీఆర్ కోసం నిధులు కేటాయింపులు చేశారు. మంత్రాలయం రోడ్ రైల్వే స్టేషన్ (తుంగభద్ర), మాధవరం, మంత్రాలయం, ఇబ్రహీంపురం, నందవరం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, కోడుమూరు మీదుగా కర్నూలు సమీపంలోని దూపాడు రైల్వే స్టేషన్ వరకు 110 కిలోమీటర్ల ఈ రైలు మార్గం పాలకుల నిర్లక్ష్యానికి గురై అటకెక్కింది.

వీటిపైనా దృష్టి సారించాలి

- కర్నూలు రైల్వే స్టేషన్‌లో ఉన్న రైల్వే గూడ్‌షెడ్లను దూపాడుకు మార్చాలనే ప్రతిపాదన ఉంది. ఖాళీ చేసే గూడ్‌షెడ్ ప్రాంతంలో రైళ్లు నిలిపేందుకు ఏర్పాట్లు చేయాలి. కర్నూలు నుంచి విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాలకు రైళ్లు నడపాలి.
- కర్నూలు నుంచి రామమేశ్వరం, విశాఖపట్నం, గద్వాల-రాయచూరు మీదుగా ముంబాయికి కొత్త రైళ్లు మంజూరు చేయాలి
- దూపాడు-ఓర్వకల్లు రైల్వేలైన్ నిర్మాణ ప్రతిపాదనను నంద్యాలకు పొడిగించాలి. తక్షణమే సర్వే, నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలి
- కర్నూలు రైల్వే స్టేషన్ పడమర వైపు వెంకటరమణ కాలనీ, అశోక్ నగర్, సంతోశ్‌నగర్.. ఇలా వివిధ కాలనీ ప్రజలకు ఉపయోగకరంగా పార్కింగ్, బుకింగ్ కేంద్రాలు సహా వివిధ సౌకర్యాలకు అమృత్ స్టేషన్‌లో భాగంగా రూ.43 కోట్లతో పనులు చేపట్టారు. రూ.11 ఆదోని రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు మొదలయ్యాయి. ఈ పనులు గడువులోగా పూర్తయ్యేలా సకాలంలో నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉంది.
- మహబూబ్‌నగర్-డోన్ వయా కర్నూలు డబ్లింగ్ రైల్వేలైన్, విద్యుద్దీకరణ పనులకు ఇటీవలే కేంద్రం ఆమోదం తెలిపింది. ఇందుకు కావాల్సిన నిధులు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని పలువురు కోరుతున్నారు.
- హగరి-జడ్చర్ల వయా ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం జాతీయ రహదారి-167 నిర్మాణంలో భాగంగా హగరి-ఆదోని వయా ఆలూరు మధ్య పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఆదోని బైపాస్ రోడ్డు పనులు తక్షణమే మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలి.

98,498 క్వింటాళ్ల పత్తి కొనుగోలు

ఆదోని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి

ఎమ్మిగనూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు పరిధిలో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 98,498 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి పద్మావతి తెలిపారు. శుక్రవారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ సీసీఐ కేంద్రాల ద్వారా 4975 మంది రైతుల నుంచి రూ.7,21,673 విలువ చేసే 98,498 క్వింటాళ్ళ పత్తి కొన్నామని అన్నారు. ప్రస్తుతం రైతులు పత్తి అమ్మకానికి రావటం లేదన్నారు. బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర మద్దతు ధరకన్నా ఎక్కువగా ఉండటంతో రైతులు అక్కడే విక్రయిస్తున్నారన్నారు. మార్చి వరకు పత్తి కొనుగోలు చేస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న పద్మావతి

హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై టీడీపీ శ్రేణుల సంబరాలు

- కర్నూలుకు హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై గౌరుచరిత హర్షం

కల్లూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబునాయుడు కర్నూలుకు హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం పట్ల పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే శుక్రవారం తన నివాసంలో కేక్‌కట్ చేసి థాంక్యూ సీఎం సార్ అంటూ కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని అమ్మ హాస్పిటల్ కూడలిలో బాణసంచా కాల్చి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. గౌరుచరిత మాట్లాడుతూ హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కావాల్సిన వసతులు, స్థల పరిశీలన కోసం కలెక్టర్‌కు సూచించడం జరిగిందని ఆమె స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు అడుగులు వేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానులని రాష్ట్రాన్ని మూడు ముక్కలుగా చేయాలని కుట్రలకు పాల్పడిందన్నారు. కర్నూలును న్యాయ రాజధాని, అమరావతిని శాసన రాజధాని, విశాఖను పరిపాలన రాజదాని అంటూ ప్రజల మనోభావాలతో ఆడుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడానికి సీఎం చంద్రబాబునాయుడు అడుగులు వేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ వార్డుల కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య, మైనార్టీ సెల్ అధ్యక్షులు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఎస్.ఫిరోజ్, ఎన్వీ.రామకృష్ణ, కర్నూలు కూడా మాజీ డైరెక్టర్ చిన్నమారెన్న, రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి నాగముని, 29వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ ఎస్.శ్రీనివాసరావు నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

నేటి నుంచి మహా చెక్

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీల పరిధిలో సెస్సు వసూళ్లను వంద శాతం పెంచేందుకు ప్రభుత్వం మహాచెక్ పేరుతో ఆకస్మిక తనిఖీలకు శ్రీకారం చుట్టిందని మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణ మూర్తి తెలిపారు. రైతుల నుంచి ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు సెస్సును చెల్లించకుండా అక్రమ మార్గాల్లో బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. అందుకే మహా చెక్ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. ప్రతిరోజు కర్నూలు జిల్లాలోని 7 మార్కెట్ కమిటీల పరిధిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో పంట ఉత్పత్తులను బయటి ప్రాంతాలకు తరలిస్తున్న వ్యాపారులు సెస్సు చెల్లించారో లేదో గుర్తించేందుకు అకస్మిక తనిఖీలు చేస్తున్నామన్నారు. కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, కర్నూలు, పత్తికొండ తదితర మార్కెట్ కమిటీల పరిధిలో తమతో పాటు ఆయా మార్కెట్ కమిటీల సెక్రటరీలు, వారి సిబ్బంది ప్రతిరోజు చెక్‌పోస్టులను తనిఖీ చేసి నివేదికను తమకు అందించాలని ఏడీఎం నారాయణమూర్తి శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు.

జిన్నింగ్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

రూ.3 కోట్ల విలువైన పత్తి దగ్ధం

నందవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి గ్రామం దగ్గర మురారి జిన్నింగ్ ఫ్యాక్టరీలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. మిల్లులో పని చేస్తున్న వారు షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఇటీవల రైతుల దగ్గర నుంచి క్వింటా రూ.6,200 ప్రకారం కొని ఫ్యాక్టరీలో ఉంచిన 5,200 క్వింటాళ్లు తగలబడిపోయాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పినా పరిస్థితి అదుపులోకి రాలేదు. యజమాని మురహరి రెడ్డి మాట్లాడుతూ ఫ్యాక్టరీలో నిల్వ ఉన్న 5వేల క్వింటాళ్ల పత్తి షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ.3 కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. అగ్నిమాపక శాఖ అధికారి రామాంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఇన్సూరెన్స్ సర్వేయర్ అంచనా వేస్తేనే నష్టం ఎంత జరిగిందన్న విషయం తెలుస్తుందన్నారు.



జిన్నింగ్ ఫ్యాక్టరీలో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

కర్ణాటకలో మిథనాల్ ఆయిల్ ట్యాంకర్ బోల్తా

రాయచూరు-మంత్రాలయం మధ్య రాకపోకలు బంద్

మంత్రాలయం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన కర్ణాటక గుంజెహల్లి గ్రామ సమీపంలో మిథనాల్ ఆయిల్ ట్యాంకర్ లారీ బోల్తా పడింది. శుక్రవారం ఈ ఘటన జరిగింది. మంత్రాలయం నుంచి రాయచూరు వెళ్తున్న మిథనాల్ ఆయిల్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో మిథనాల్ ఆయిల్ రోడ్డుపై పడింది. మిథనాల్‌కు పేలుడు సంభవించే ప్రమాదం ఉండటంతో ఎరిగేరి, రాయచూరు పోలీసులు అగ్నిమాపక సిబ్బంది, ఆర్‌టీపీఎస్, పీఐఎస్ఎఫ్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు రాయచూరు-మంత్రాలయం జాతీయ రహదారి-167 మధ్య వాహనాల రాకపోకలకు బంద్ చేయించారు. దీంతో భక్తులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మిథనాల్ ట్యాంకర్ పేలకుండా కర్ణాటక పోలీసులు అప్రమత్తత వహించి మిథనాల్‌ను తొలగించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఆర్‌యూ విద్యార్థి

కర్నూలు అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రాయలసీమ యూనివర్సిటీ విద్యార్థి బి. శ్రీనివాసులు ఎంపిక కావడం అభినందనీయమని వర్సిటీ ఇన్‌చార్జీ ఉపకులపతి, ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. 2న మంగళగిరిలో జరిగే 7వ ఆంధ్రప్రదేశ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్షిప్ లో శ్రీనివాసులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి. విజయకుమార్, డీన్ సుందరానందపుచ్చా, అసిస్టెంట్ డైరెక్టర్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ శివ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఆర్‌యూ వీసీ, ప్రొఫెసర్లు

హైకోర్టు బెంచ్‌కు వేగంగా అడుగులు..

● టీడీపీ లీగల్ సెల్



మాట్లాడుతున్న టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగదీష్

కర్నూలు అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లాకు హైకోర్టు బెంచ్ రాబోతోందని, అందుకు సంబంధించిన ప్రక్రియ జరుగుతుందని టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేయి. జగదీష్ అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందుకు సీఎం చంద్రబాబు ఇచ్చిన హమీ మేరకు అధికారంలోకి రాగానే జిల్లాలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కొంత మంది వైసీపీ నాయకులు చేతగాని చౌకబారు మాటలు మాట్లాడుతున్నారని, జగన్ మీడియా, పేపర్‌లో తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు హనుమంతరావు చౌదరీ, లీగల్ సెల్ ఉపాధ్యక్షులు దాశెట్టి శ్రీనివాసులు, శ్రీనివాసబట్, శ్రీహరీ, హరినాథ్ చౌదరీ, గణేష్ సింగ్, నాగమునీ, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

భద్రత నియమాల పట్ల అవగాహన ఉండాలి

కర్నూలు అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత నియమాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జీ ఉప కులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనవరి నెలంతా రహదారి భద్రతకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. తాలుకా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎం. నరేష్ రహదారి భద్రతకు సంబంధించి విద్యార్థులకు వివిధ సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పీ. నాగరాజు, ప్రిన్సిపల్స్ హరినాథ్‌రెడ్డి, సీవీ కృష్ణారెడ్డి, ఎన్ నరసింహులు, విజయుడు, నాగచంద్రుడు, శివప్రసాదరెడ్డి, విద్యార్థులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వినియోగించుకోవాలి

ఓర్వకల్లు, జనవరి 31: (ఆంధ్రజ్యోతి): ఆయా గ్రామాల్లోని వ్యవసాయ కూలీలు, ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు కోరారు. శుక్రవారం మండలంలోని తిప్పాయపల్లె, కన్నమడకల, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో కుమారసాయినాథ్, టీఏలు పాల్గొన్నారు.

పొగాకు బేళ్లను సీఆర్ చేసే విధానాన్ని మానుకోవాలి



నన్నూరు పొగాకు గోడౌన్ ఎదురుగా ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

ఓర్వకల్లు, జనవరి 31: (ఆంధ్రజ్యోతి): పొగాకు బేళ్లను సీఆర్ చేసే విధానాన్ని మానుకోవాలని, క్వింటానికి రూ.15వేల నుంచి రూ.18వేలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని నన్నూరు గ్రామంలో పొగాకు కొనుగోలు చేస్తున్న అలవెన్స్ కంపెనీ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. రామకృష్ణ మాట్లాడుతూ పొగాకు కంపెనీల యజమాన్యం ఆకు నల్లగా ఉందని, తేమ ఎక్కువగా ఉందని రిజెక్ట్ చేసి నామమాత్రమైన రేట్లు నిర్ణయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ యజమాన్యం రైతు సంఘం సభ్యులతో చర్చలు జరిపారు. సాధ్యమైనంత వరకు రూ.15వేల నుంచి రేటు తగ్గకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, షాజహాన్, మల్లేష్, రైతులు గిడ్డయ్య, దస్తగిరి, దానమయ్య, సిద్దయ్య, సంజీవ, బషీర్, మాసూం బాషా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



మురుగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం వెంకటరమణ కాలనీ, వీనస్ కాలనీ, అశోక్‌నగర్ ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యల ప్రదేశాలను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ముందుగా పాతబస్తీలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్, ఖడక్‌పుర, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సకు సంబంధించి పంప్ హౌస్‌లో సీసీ డ్రైనేజీ నిర్మాణాన్ని పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో తొలి ప్రాధాన్యత మౌలిక వసతుల కల్పనకు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజేశ్వరరెడ్డి, ఎంఈ శేషసాయి, డీఈఈ గంగాధర్, ఏఈలు నాగజ్యోతి, మనోజ్ పాల్గొన్నారు.

బీటీఆర్ నగర్‌లో సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలోని 19,20 వార్డులలో బీటీఆర్ నగర్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు నరసింహులు అన్నారు. శుక్రవారం నగర పాలక కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో కాలువలు, డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.రాధాక్రిష్ణ, సుబ్బరాయుడు, రత్నమ్మ, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కోడుమూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వర్కూరు గ్రామానికి చెందిన నాగలక్ష్మీ (39) అనే మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. గత నెల 28న సాయంత్రం కూలీపనుల నుంచి ఇంటికి వస్తుండగా బైక్ పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడింది. చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త నాగార్జున ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



చిన్న అమ్మవారిశాలలో పూజలకు హాజరైన మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ దంపతులు



గీతా మందిరంలో హోమం నిర్వహిస్తున్న మందిర కమిటీ ప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో వాసవీ మాత ఆత్మార్పణ దినం

● చిన్న అమ్మవారిశాలలో పూజలు చేసిన టీజీ వెంకటేశ్ దంపతులు



పూజలందుకుంటున్న అమ్మవారు

కర్నూలు కల్చరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని వాసవీ అమ్మవారిశాలల్లో శుక్రవారం వాసవీ మాత ఆత్మార్పణ దినం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి ఉదయం వేకువ జామునుంచీ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పాతనగరంలోని పూలబజార్‌లోగల చిన్న అమ్మవారిశాలలో, కల్లూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, టీజీ రాజ్యలక్ష్మి దంపతులు పూజలు నిర్వహించారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఆడపడుచుల ఆత్మాభిమానం కోసం వాసవీ మాత ఆత్మార్పణం చేసిన రోజు ఈరోజు అని అన్నారు. ఆమెతోపాటు 102 మంది కూడా అగ్నికి ఆహుతై ఆత్మార్పణ చేశారని గుర్తు చేశారు. అందుకే ఆర్యవైశ్యులకు 102 గోత్రాలు ఏర్పడ్డాయని, ఆ గోత్ర నామాల ప్రకారమే సంప్రదాయబద్ధంగా వివాహాలు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆర్యవైశ్యులకు ఎంతో పవిత్రమైన అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా నిర్వహించ తలపెట్టడం అభినందనీయమని అన్నారు. అంతేకాకుండా పెనుగొండలో జరిగే ఈ వేడుకలను స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి టీజీ భరత్ హాజరుకావడం హర్షించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం నాయకులు వాయుగుండ్ల సుబ్బారావు, విఠలశెట్టి, సుబ్రహ్మణ్యం, శేషగిరిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

● వన్‌టౌన్‌లోని గీతామందిరంలో...వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినం కార్యక్రమాన్ని వన్‌టౌన్‌లోని గీతా మందిరంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పూజలు చేశారు. ఈ వేడుకలో భాగంగా ఆలయం ఆవరణలో చండీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రేగూరు విజయభాస్కర్, కార్యదర్శి తల్లం గోపి, కోశాధికారి చిత్రాల సురేష్, సభ్యులు ప్రకాశ్, రేగూరు బాలకృష్ణ, నాగరాళ్ల భాస్కర్, నరహరి శ్రీనివాస్, బియ్యపు రంగనాథ్, హరి, రవి తదతరులు పాల్గొన్నారు.



గీతా మందిరంలో చండీ హోమం

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

● జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు కే. పార్వతమ్మ



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 31: (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వంతోనే బీసీల అభివృద్ధి జరుగుతుందని నంద్యాల జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు కే.పార్వతమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని బిర్లాగేటు సమీపంలో గల బీసీ సంక్షేమ భవన్ నందు టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో వెనుకబడి గుర్తింపు లేని బీసీ సమాజానికి స్థానిక సంస్థలైన సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మన్‌గా బీసీలకు గుర్తింపునిచ్చి రాజకీయ నాయకులను తయారు చేసింది టీడీపీనే అన్నారు. రాష్ట్ర ఆర్థిక సమస్యతో ఇబ్బందులు పడుతున్న బీసీల సంక్షేమానికి దాదాపు రూ.896 కోట్లు కేటాయించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో కురువ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు రామకృష్ణ, వెంకట్రాముడ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ విజయకుమార్, బెస్త సాధికార కమిటీ జిల్లా అధ్యక్షులు పీజీ వెంకటేశ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణోజిరావు, టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బాలలను గుర్తించేందుకు తనిఖీలు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వీధి బాలలను గుర్తించేందుకు శుక్రవారం నగరంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ వీధి బాలలను గుర్తించడానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని, బాలలు ఎవరైనా కార్మికులుగా పని చేస్తుంటే వెంటనే వారిని గుర్తించి సంబంధిత అధికారులకు అప్పజెప్పాలని కోరారు. కర్నూలు జిల్లాను బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దడానికి సిబ్బంది అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. వీధి బాలలు ఎవరికైనా కనిపిస్తే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ టోల్‌ఫ్రీ నెంబర్. 15100 లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్.1098కు గానీ తెలియజేయాలని ఆయన కోరారు. ఆ తర్వాత అధికారులతో కూడిన బృందాలు కొత్తబస్టాండు, పాతబస్టాండు, రాజ్ విహార్ సెంటర్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం.వెంకట హరినాథ్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ వెంకటేశ్వర్లు, కర్నూలు అర్బన్ తహసీల్దార్ ఈ.వెంకటలక్ష్మి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎం.శివరామచంద్రరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ రమణరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారికి భూమి పూజ

కోడుమూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కూరులో సీసీ రహదారి నిర్మాణానికి కూటమి నాయకులు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. టీడీపీ నాయకులు జెఎం రాముడు, గోల చెన్నరాయుడు మాట్లాడుతూ స్థానిక పులకుర్తి రోడ్డులో బోయ చంద్రన్న ఇంటి నుంచి ఉప్పరి దైవాదీనం ఇంటి వరకు గుంతలు, బురదమయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమస్యపై స్పందించి సీసీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిలకు నాయకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామాంజనేయులు, తుమ్మిల్ల మద్దిలేటి, లక్ష్మన్న, జనసేన గిరి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోండి

గూడూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బీసీ కమ్యూనిటీకి చెందిన వారందరూ బీసీ సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శివనాగప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీసీ కమ్యూనిటీకి చెందిన బీసీ-ఏ, బీసీ-డీ కులాలకు చెందిన వారు రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ మీద స్వయం ఉపాధి రుణసదుపాయం బ్యాంకుల ద్వారా కల్పిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారందరూ ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 7వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

అధికారులు బాధ్యతతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ

సి. బెళగల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలస్థాయి అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ సచివాలయ అధికారులు సమయపాలన పాటించడం లేదన్నారు. గ్రామాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ పురుషోత్తం మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో మండల ఎంపీటీసీలు, సర్పంచులు, ఎంపీడీవో రాణెమ్మ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఫీజు రీఎయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలనినంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, రాంభూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాలలో 5న చేపట్టే ఫీజుపోరు కార్యక్రమానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులు తరలి రావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం కల్లూరులోని తన స్వగృహంలో ఆయన ఫీజుపోరు పోస్టర్‌ను ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పరీక్షలకు హాజరు కావాలి: ప్రిన్సిపాల్

కోడుమూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శని, సోమవారాల్లో జరిగే పరీక్షలకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలని ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలలో భాగంగా శనివారం మొదటి ఏడాది విద్యార్థులకు నైతికత, మానవవిలువలు అంశంపై 3న పర్యావరణ విద్య అనే పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా పరీక్షలు రాయాలని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 15 నుంచి ప్రాక్టికల్, మార్చి 1 నుంచి థియరీ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

కర్నూలు కలెక్టరేట్, జనవరి 31: (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు, చిన్న పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని మహిళ, శిశు అభివృద్ధి వికలాంగులు, సీనియర్ సిటీజన్స్ శాఖల సెక్రటరీ ఏ.సూర్యకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సునయన ఆడిటోరియంలో వివిధ ఐసీడీఎస్ అంశాల అమలుపై మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డితో కలిసి మహిళా, శిశు అభివృద్ధి వికలాంగులు, సీనియర్ సిటిజన్స్ శాఖల సెక్రటరీ ఐసీడీఎస్ సీడీపీవో సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. సెక్రటరీ మాట్లాడుతూ దేశంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్లలో కంటే మన రాష్ట్రం లో అంగన్‌వాడీ సెంటర్లలో మంచి పోషకాహారం అందించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలోని పిల్లలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి పోషకాహారాలు అందిస్తున్నారన్నారు. ఈ పోషకాహారం తీసుకోవడం వల్ల గర్భిణులు స్త్రీలకు, చిన్న పిల్లలకు రక్తహీనత బరువు తక్కువ వంటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 1975వ సంవత్సరం నుంచి ఐసీడీఎస్ కార్యక్రమాలు జరుగుతున్నాయని, 50 సంవత్సరాలు పూర్తయిందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, ఐసీడీఎస్ పీడీ నిర్మల, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రైల్వేబడ్జెట్‌లో జిల్లాకు నిధులు కేటాయించాలి



రైల్వేస్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కర్నూలు రూరల్ జనవరి31(ఆంధ్రజ్యోతి): రైల్వేబడ్జెట్‌లో కర్నూలు జిల్లాకు నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు సిటీ రైల్వేస్టేషన్ ముందు నిధులు కేటాయించాలని నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పాలకులు మారిన కర్నూలు జిల్లా భవిష్యత్ మారడం లేదని, ఇక్కడ నుంచి రాజధానికి వెళ్లాలంటే కనీసం ఒక రైలు కూడా లేకపోవడం నగర ప్రజల దౌర్భాగ్యమన్నారు. రైల్వేవ్యాగన్ ద్వారా వందలాది మందికి ఉపాధి కల్పిస్తామన్న నాటి ప్రభుత్వం చేసిన వాగ్దానాలు నేటికి నెరవేరలేదన్నారు. దాదాపు 14ఏళ్లు కావస్తున్న ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని వాటి కోసం నిధులు కేటాయించడంలో బీజేపీ ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి రాజశేఖర్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాధాకృష్ణ, అంజిబాబు, సాయిబాబా, సుధాకరప్ప,నరసింహులు,విజయ్ పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలను సీజ్ చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 31: (ఆంధ్రజ్యోతి): గుర్తింపులేని నారాయణ పాఠశాలను సీజ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కే.రమణ కుమార్, ఎంఎస్ఎఫ్ మైఖేల్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నగరంలోని ఏ.క్యాంపులోని నారాయణ పాఠశాల ముందు వారు ధర్నా చేశారు. అనంతరం డిప్యూటీ డీఈవోకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు నిర్వహిస్తూ, విద్యార్థి తల్లిదండ్రులను మోసం చేస్తున్న నారాయణ పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూర్య, రాము, అస్లాం, కిరణ్, మధు పాల్గొన్నారు.

మద్యం షాపు కోసం దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ మంజుల

కోడుమూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణం కోసం అర్హులైన గౌడ కులస్తులు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ మంజుల అన్నారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో శుక్రవారం ఆమె మాట్లాడుతూ కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని క్రిష్ణగిరి మండలంలో గీతకులాలు (గౌడు)మద్యం దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. నేటి వరకు ఒక్కరు కూడా దరఖాస్తు చేసుకోలేదని చెప్పారు. అర్హులైన వాళ్లు దరఖాస్తుతో పాటు ఫీజు రూ.2లక్షలు, నివాస స్థలం, కుల ధ్రువీకరణ పత్రాలు తప్పని సరిగా సమర్పించాలన్నారు. 5న సాయంత్రం 5 గంటలకు దరఖాస్తు స్వీకరణ గడువు ముగుస్తుందన్నారు. 7న డ్రా తీయనున్నట్లు ఆమె చెప్పారు

కళా సంస్థలకు, కళాకారులకు ప్రోత్సాహకాలు అందిస్తా

● రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కళా సంస్థలకు, కళాకారులకు తన సహాయ సహకారాలు, ప్రోత్సాహకాలు ఎప్పుడూ ఉంటాయని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మౌర్యఇన్‌లోని కర్నూలు నియోజకవర్గ టీడీపీ కార్యాలయం ఎదుట కర్నూలులోని కళావాహిని సాంస్కృతిక, సాహిత్య సంస్థ వారి 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్రతి ఏటా కళాకారులకు ఉపయోగకరంగా క్యాలెండర్‌ను ముద్రిస్తున్న కళావాహిని సంస్థ అధ్యక్షుడు ఎం. మనోహర్‌బాబును టీజీ వెంకటేశ్ అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ కళాకారులు దస్తగిరి, వినోద్‌కుమార్, నాగశేషయ్య, ఎంఆర్ చంద్ర, వెంకట సుబ్బయ్య, ఆనందరావు, పెద్దన్న, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఓమినీ హాస్పిటల్‌లో విచారణ

కర్నూలు హాస్పిటల్, జనవరి 30: (ఆంధ్రజ్యోతి): ఓమినీ హాస్పిటల్‌లో వైద్యం వికటించి ఎన్టీఆర్ వైద్య సేవ రోగి మృతి చెందిన ఘటనపై ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డా.భాస్కర్ రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. ఓమినీ హాస్పిటల్‌లో ఆయన ఎన్టీఆర్ వైద్యసేవ రోగుల దగ్గరకు వెళ్లి విచారణ చేశారు. ఎన్టీఆర్ వైద్యసేవలు పూర్తిగా ఉచితమని ఈ రోగుల నుంచి అదనంగా ఎలాంటి డబ్బులు వసూలు చేయరాదని, ఎవరైనా అదనంగా వసూళ్లు చేస్తే అలాంఅటి నెట్‌వర్క్ హాస్పిటల్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గురువారం హాస్పిటల్‌లో మృతి చెందిన ఆరోగ్యశ్రీ రోగి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగి బంధువులకు ఫోన్ చేసే వివరాలు అడిగారు. ఆరోగ్యశ్రీ కింద రూ.70వేలు వసూలు చేశారని, ఇందులో రూ.50వేలు ఫోన్‌పే అకౌంటు ద్వారా రూ.20వేలు డబ్బులు కట్టినట్లు బంధువులు తెలిపినట్లు ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ తెలిపారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే హాస్పిటల్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

● ఓమినీ హాస్పిటల్‌లో సర్జరీలు వికటించి రోగులు మరణిస్తున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. శుక్రవారం డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళకు వినతి పత్రం సమర్పించారు.

'దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విద్యావేత్త డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి

కర్నూలు కల్చరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో, డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో 'యువ ఉత్సవ్ 2047' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు నైపుణ్యంతో కూడిన విద్యతో ముందుకు పోవాలని సూచించారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్ రాహుల్ గిరిరెడ్డి, బీజేపీ జిల్లా జాయింట్ సెక్రటరీ సాయిప్రదీప్, కళాశాల అధ్యాపకులు, వివిధ కళాశాలల విద్యార్థులు, జాగృతి అధ్యక్షుడు ఎన్ నగేష్, యువజన సంఘాల సభ్యులు బద్రి, లక్ష్మన్న, విశాల్, చిన్న, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీవనానికి భద్రత ఈశ్రమ్ కార్డు

కర్నూలు న్యూసిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కార్మిక కర్షక వృత్తి కుటుంబాలక, వలస కార్మికులకు ఈ శ్రమ్ కార్డు భద్రత కల్పిస్తుందని కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఎం.బాలునాయక్ అన్నారు. శుక్రవారం కార్మిక శాఖ కార్యాలయంలో కార్మికులకు ఈశ్రమ్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ బి.వెంకటేశ్వర్లు, సహయ కార్మిక శాఖ అధికారులు కేశన్న, రాంప్రసాద్, మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత తదితరులు పాల్గొన్నారు.

శాప్ చైర్మన్‌కు ఘన స్వాగతం

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 31: (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీవీఆర్ కన్వెన్షన్ హాలులో ఆంధ్రప్రదేశ్ శాప్ చైర్మన్ రవినాయుడుకు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, ఒలంపిక్, క్రీడా సంఘాల ప్రతినిధులు శాప్ చైర్మన్‌ను కలిసి పూలబొకేను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. చైర్మన్ కర్నూలు క్రీడల గురించి అడిగి తెలుసుకున్నారు. చైర్మన్‌ను కలిసిన వారిలో క్రీడా సంఘాల ప్రతినిధులు రామాంజనేయులు, హర్షవర్ధన్, షేక్షావలి, వేణుగోపాల్, షబ్బీర్, కరాటే వెంకటేశ్, చిన్న సుంకన్న, ప్రవీణ్, వీరేష్, హాకీ దాసరి సుధీర్, రవికుమార్, డీఎస్‌ఏ సిబ్బంది ఉన్నారు.

రసాభాసగా కౌన్సిల్..

- బీజేపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వావాదాలు
- గందరగోళంగా సమావేశం
- అజెండా చర్చ లేకుండానే వాయిదా



చైర్ పర్సన్ పోడియం ముందు బైఠాయించిన బీజేపీ మద్దతు కౌన్సిలర్లు



మహిళా కౌన్సిలర్ల వాగ్వావాదం

ఆదోని టౌన్, జనవరి31 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. శుక్రవారం చైర్పర్సన్ వాల్మీకి శాంత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. 35వ వార్డు అమరావతి నగర్ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ మాట్లాడుతూ తన వార్డు పనులను కావాలనే వాయిదా వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకపక్షంగా వ్యవహరిస్తూ, వేధింపులకు గురిచేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆమెను సమావేశం నుండి బయటికి పంపాలని వైస్ చైర్మన్ నరసింహులు చెప్పడంతో చైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించారు. ఆమెకు మద్దతుగా బీజేపీకు మద్దతుదారులుగా ఉన్న కౌన్సిలర్లు చిన్నా, సురేష్, పద్మావతమ్మ కూడా బైఠాయించారు. ఒక సందర్భంలో ఎవరు ఏం మాట్లాడుతున్నారో తెలియక గందరగోళ పరిస్థితి కనిపించింది.

కౌన్సిలర్ రఘు మాట్లాడుతూ, వైసీపీ నుంచి గెలిచి బీజేపీకి మద్దతు తెలుపుతున్న వారు రాజీనామా చేసి తిరిగి బీజేపీ నుంచి పోటీ చేయాలని సవాల్ విసిరారు.

కౌన్సిలర్ బాలాజీ మాట్లాడుతూ, కొందరు పారిశుధ్య కార్మికులు ఇతరులతో పనులు చేయిస్తున్నారని, గుర్తింపు కార్డులు ఇస్తే పనిదొంగలు బయట పడతారని డిమాండ్ చేశారు. పోలీస్ కంట్రోల్ రూమ్‌లోని 58 సీసీ కెమెరాలలో 8 మాత్రమే పని చేస్తున్నాయని, మరమ్మతులు చేయాలని లేకపోతే కొత్తవి అమర్చాలన్నారు. చివరకు అజెండాలోని 7 అంశాలను చర్చించకుండానే వాయిదా వేశారు. సమావేశంలో కమిషనర్ కృష్ణ, అసిస్టెంట్ కమీషనర్. డా అనుపమ, ఎంఈ ఇంతియాజ్ అలీ, ఏసీపీ కృష్ణ సింగ్, డీఇలు గోపినాథ్, రామమూర్తి పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

తుగ్గలి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇస్తున్న కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో విశ్వమోహన్ సూచించారు. శుక్రవారం తుగ్గలిలో మాట్లాడుతూ కులం, ఆదాయ ధ్రువపత్రాలతో ఫిబ్రవరి 7వ తేదీలోపు మీసేవలో దరఖాస్తు చేయాలన్నారు. అనంతరం దరఖాస్తు కాపీని ఎంపీడీవో కార్యాలయంలో అందించాలని సూచించారు.

అభివృద్ధి పనులు వేగవంతం

మద్దికెర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయని పంచాయతీరాజ్ డీఈ శేషయ్య తెలిపారు. శుక్రవారం పెద్దనగరి వీధిలో సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. మండలంలో ఇప్పటికే రూ.2 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. 8 గ్రామ పంచాయతీలకు హెల్త్ క్లీనిక్, అంగన్‌వాడీ కేంద్రాలు, డ్రైనేజీ నిర్మాణం, తాగునీటి పథకాలకు రూ.కోటి మంజూరైందని తెలిపారు. పెరవలి మెయిన్‌బజారులో సీసీరోడ్డు పూర్తయిందని, మద్దికెరలో బస్టాండు వద్ద సీసీ రోడ్డును త్వరలో ప్రారంభిస్తామన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫారం అడ్డంగా ఉందని, దాన్ని తొలగించిన వెంటనే రోడ్డు పనులు మొదలు పెడుతామన్నారు. జడ్పీటీసీ సభ్యుడు మురళిధర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, సలహాదారులు బండారు ఆంజనేయులు, ఏఈ విష్ణువర్ధన్, వెంకటేశ్వరరెడ్డి, బాలచంద్ర కార్యదర్శి శివకుమార్ ఉన్నారు.

కర్ణాటక మద్యం ధ్వంసం

ఆదోని, జనవరి31 (ఆంధ్రజ్యోతి): సర్కిల్ పరిధిలో పట్టుబడ్డ రూ.10 లక్షల విలువైన కర్ణాటక మద్యం బాటిళ్లను ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేశారు. శనివారం పట్టణ శివారులో సీఐ సైదుల్లా ఆధ్వర్యంలో ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. సీఐ మాట్లాడుతూ ఆదోని సబ్ డివిజన్ పరిధిలో 2,211 లీటర్ల అక్రమ మద్యం, 127 లీటర్ల నాటుసారాను సీజ్‌చేశామని, వీటి విలువ రూ. 10 లక్షలు ఉంటుందని తెలిపారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ రామకృష్ణా రెడ్డి ఉత్తర్వుల మేరకు అక్రమ మద్యాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు.



ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సీఐ, సిబ్బంది

ఆసుపత్రి అభివృద్ధికి సహకరించండి

పత్తికొండ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి సహకరించాలని వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను పత్తికొండ బీజేపీ కోకన్వీనర్ గోవర్దన్ నాయుడు కోరారు. శుక్రవారం మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి నియోజకవర్గ అభివృద్ధి సమస్యలపై వివరించారు. స్పందించిన మంత్రి ఆసుపత్రి అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారని గోవర్దన్ నాయుడు తెలిపారు.



మంత్రితో గోవర్ధన్ నాయుడు

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

మద్దికెర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదవాలని హెచ్‌ఎం దేవేంద్రప్ప యూటీఎఫ్ మండల కార్యదర్శి విశ్వనాథ్, కార్యదర్శి శివకుమార్ అన్నారు. శుక్రవారం జడ్పీ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయురాలు అనురాధ జ్ఞాపకార్థం భర్త సూర్యనారాయణ పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. నాగరాజు, ఆనంద్ కుమార్, విద్యాకమిటి వైస్ చైర్మన్ చంద్రహరి ఉన్నారు.



మెటీరియల్ ను అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆర్టీసీ కార్గోపై అవగాహన పెంచాలి



డైరీని విడుదల చేస్తున్న ఆర్టీసీ మేనేజర్ రఫిక్ అహ్మద్

ఆదోని అగ్రికల్చర్, జనవరి31 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సేవలపై ప్రజల్లో అవగాహన పెంచాలని డీఎం రఫీ అహ్మద్ సూచించారు. శుక్రవారం ఆర్టీసీ జై భీమ్ అసోసియేషన్ డైరీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సిబ్బంది బస్సుల సమయపాలన పాటించాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఆర్టీసీ కార్గో సేవలో 50 కేజీల వరకు సరుకు డోర్ డెలివరీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మల్లికార్జున, అసిస్టెంట్ మేనేజర్ వేణుగోపాల్, హెడ్ కానిస్టేబుల్ రామలింగప్ప, జావేద్, ఆరోగ్యప్ప, నర్రప్ప పాల్గొన్నారు.

ఉపాధి పనులు వినియోగించుకోండి

దేవనకొండ,జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గ్రామ ప్రజలు ఉపాధి పనులను వినియోగించుకోవాలని ఎంపీడీవో సూర్యనారాయణ, ఏపీవో రత్నం సూచించారు. కప్పట్రాళ్లలో గ్రామస్తులతో మాట్లాడారు. వలసలు వెళ్లకుండా ఉపాధి పనికి వెళ్తే రూ.మూడు వందల కూలీ వస్తుందన్నారు.

వైభవంగా అమ్మవారి ప్రతిష్ఠ

దేవనకొండ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గద్దెరాళ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలోకి శుక్రవారం తెల్లవారుజామున విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలాగే అంజనేయ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ఉరువాకిలిని పారరంభించారు.

ఆదోని రోడ్లపై యమ ధర్మరాజు

- డీఎస్పీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



యమ ధర్మరాజు, చిత్రగుప్తుడి వేషధారణలో పోలీసుల ప్రదర్శన

ఆదోని, జనవరి31 (ఆంధ్రజ్యోతి): రహదారి నియమాలు పాటించకుంటే యమధర్మరాజు వస్తాడని ఆదోని పోలీసులు వినూత్నంగా ర్యాలీ నిర్వహించారు. రోజురోజుకి పెరిగిపోతున్న ప్రమాదాలను నివారించేందుకు యమధర్మరాజు, చిత్ర గుప్తుడి వేషధారణతో ప్రజలకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ నేరమని, చిన్నపాటి నిర్లక్ష్యంతో విలువైన ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని తెలిపారు. జరిమాన విధిస్తున్నా, కౌన్సెలింగ్ ఇచ్చినా నిర్లక్ష్యంగా ఉండి, ప్రాణాలు కోల్పోతున్నాడని డీఎస్పీ హేమలత అన్నారు. సీఐలు గంట సుబ్బారావు, సూర్యమోహన్ రావు పాల్గొన్నారు.

పదవీ విరమణ తప్పనిసరి



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

దేవనకొండ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగికి పదవీ వీరమణ తప్పనిసరని తహసీల్దార్ లోకేశ్వరయ్య అన్నారు. శనివారం తహసీల్దార్ పదవీ విరమణ పొందారు. విధుల్లో ప్రజలకు సేవ చేసి గుర్తింపు తెచ్చుకొవాలని, ప్రతి ఉద్యోగికి అటుపోట్లు తప్పవని, అధిగమించి ముందుకు సాగాలన్నారు. మండలంలోని మరో ముగ్గురు ఉపాధ్యాయులు రంగస్వామి, ఎస్‌ఎండీ బాషా ఉచ్చీరప్ప కూడా పదవీ విరమణ పొందారు.

వాసవి అమ్మవారికి ప్రత్యేక పూజలు



ఇరుముడితో పల్లకి ఉత్సవంలో పాల్గొన్న మహిళలు

ఆదోని, జనవరి31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నగరేశ్వర స్వామి ఆలయంలో వాసవి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం మాలాధారులకు ఇరుముడి, పల్లకి ఉత్సవము, కుంకుమార్చన, వాసవి హోమం దీపాలంకరణ సేవ మరియు మహామంగళ హారతి నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం చైర్మన్ ప్రకాష్, అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

24గంటల్లో బండలను తొలగించాలి

ఆదోని రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలసందగుత్తిలో సర్వే నెం.149లో ప్రభుత్వ భూమి 30 సెంట్ల స్థలం కబ్జాపై ఆంధ్రజ్యోతిలో శుక్రవారం 'పులిరాజా' పాగా శీర్షికన కతనం ప్రచురితమైంది. స్పందించిన సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ భూ కబ్జాపై విచారణ చేసి, నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ శివరాముడుకు ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్ కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. 24గంటల్లో బండలను తొలగించాలని లేనిపక్షంలో తామే తొలగిస్తామని తహసీల్దార్ కబ్జాదారులను హెచ్చరించారు.



కబ్జాదారులను హెచ్చరిస్తున్న తహసీల్దార్

అరికేరలో ప్రశాంతతకు చర్యలు : సీఐ

ఆలూరు, జనవరి31 (ఆంధ్రజ్యోతి): అరికేర గ్రామంలో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆలూరు సీఐ వెంకట చలపతి శుక్రవారం తెలిపారు. ఇటీవల గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ హత్యతో అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ఎస్సై దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న దిబ్బల గాది లింగ, గోవర్దన్, కురుకుంద మహేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. బెదిరింపులకు పాల్పడిన మంగళి గోపి, బొగ్గుల ఈరన్న, రాందాస్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థిని మృతి

మద్దికెర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపా గ్రామానికి చెందిన విద్యార్థిని జి.కవిత శుక్రవారం మృతి చెందింది. స్థానిక జడ్పీ బాలికల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. అనారోగ్యంతో బాధపడుతూ రెండు రోజుల క్రితం గుంతకల్లుకు వెళ్లగా కోలుకోలేక మృతి చెందింది. కాగా తల్లిదండ్రులు పదేళ్ల క్రితమే మృతి చెందారు. ఉపాధ్యాయుడు దేవేంద్రప్ప సంతాపం తెలియజేశారు.

బియ్యం తరలిస్తున్న నలుగురి అరెస్టు

ఆదోని రూరల్, జనవరి 03 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్న నలుగురు నిందితులను తాలుక సీఐ నల్లప్ప అరెస్టు చేశారు. గుంతకల్లు నుంచి రాయచూరుకు పేదల బియ్యాన్ని తరలిస్తున్నారని సీఐకి సమాచారం అందింది. అప్రమత్తమైన సీఐ, ఇస్వీ ఎస్.ఐ నాగేంద్రను ఢణాపురం వద్దకు పంపించారు. అయితే బియ్యం దొంగలు పోలీసులను చూసి ఆపకుండా వెళ్లిపోయారు. సీఐ లక్ష్మమ్మవ్వ అర్చీ వద్ద వాహనాన్ని నిలిపి, డ్రైవర్ నాగరాజు, మల్లికార్జునతోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకన్నారు. 12 టన్నుల బియ్యాన్ని రెవెన్యూ అధికారులు ఖాసిం, రాజశేఖర్ గౌడ్‌కు అప్పజెప్పినట్లు సీఐ తెలిపారు.

డీలర్ల నియామకంలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలి



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి31 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల నియామకంలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు, కార్యదర్శి బసాపురం లింగప్ప అంజిత్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. కూటమి నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి, గొడవలు సృష్టిస్తున్నారన్నారు. పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన వారికే కేటాయించాలని ఏవోకు వినతిపత్రం అందిజేశారు. నాయకులు శ్రీకాంత్, రమేష్ లింగప్ప, శేకర్ భాషా పాల్గొన్నారు.

తాగునీరు అందిస్తాం

ఆలూరు రూరల్, జనవరి31 (ఆంధ్రజ్యోతి) : మొలగవల్లి గ్రామంలో తాగునీరు అందిస్తామని సర్పంచ్ మోహన్ రాజ్ అన్నారు. మొలగవల్లి గ్రామంలో రెన్యూ పవర్ కంపెనీ సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను శుక్రవారం కంపెనీ ప్రతినిధులు శ్రీనివాసులు, రాజేష్, శ్రీనివాసరావు ప్రారంభించారు. ఉసేనీ, కంది శ్రీనివాసులు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన బీజేపీ నాయకులు

ఆదోని టౌన్, జనవరి31 (ఆంధ్రజ్యోతి): డీఎస్పీ హేమలతను శుక్రవారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అధికార ప్రతినిధి విజయకృష్ణ మాట్లాడుతూ, 14 ఏళ్ల అనంతరం పట్టణానికి మహిళా పోలీస్ అధికారి రావడంతో సంతోషంగా ఉందన్నారు. పట్టణంలోని సమస్యలపై డీఎస్పీతో చర్చించామని, బాల కార్మికులు, బాలవివాహాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించామని తెలిపారు. అనంతరం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని జ్ఞాపికగా అందించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి రమాకాంత్, యువమోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి శ్రీనివాసచారి, వాల్మీకి సాయి ప్రసాద్, ఎన్‌డీఏ కూటమి సోషల్ మీడియా రవి ఉన్నారు.

తెరిచేదెప్పుడు సారూ..?



తాళం వేసిన మారెళ్ల సచివాలయం

తుగ్గలి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్లలో శుక్రవారం ఉదయం 11 గంటలైనా తెరచుకోలేదు. నిరంతరం స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాల్సిన సిబ్బంది ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిరిగారు. ఉన్నతాధికారులు స్పందించి విధులకు డుమ్మా కొట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సూపరింటెండెంట్ మహబూబ్ బాషాను వివరణ కోరగా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మీరే నిర్ణయాలు తీసుకుంటే మేమెందుకు?

- ఈవోను నిలదీసిన సభ్యులు

ఆలూరు, జనవరి31 (ఆంధ్రజ్యోతి): అధికారులే నిర్ణయాలు తీసుకుంటే ఇక మేమెందుకు అంటూ సభ్యులు గౌడప్ప, వరుణ్, అనిల్ ప్రశ్నించారు. శుక్రవారం గ్రామ పంచాయతీలో సర్పంచ్ అరుణ దేవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని పనులు అన్నీ చేశాక ఆమోదం కోసమే సమావేశాన్ని ఏర్పాటు చేస్తారే తప్ప ముందుగా చర్చింకపోవడంపై మండిపడ్డారు. సంత మార్కెట్ 27 దుకాణాలకు మూడు నెలల క్రితమే వేలం వేశారని, ఇప్పుడు ఆమోదం చేయమంటే ఎలా చేస్తామని ప్రశ్నించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం వేశామని ఈవో ప్రభాకర్ రావు సమాధానం ఇచ్చారు.



ఈవో ప్రభాకర్ రావును ప్రశ్నిస్తున్న సభ్యులు

కలగానే సూపర్ సిక్స్



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్

ఆదోని టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ అమలు కలగానే మిగిలిందని మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు విమర్శించారు. శుక్రవార మాట్లాడుతూ దొంగ వాగ్దానాలతో ప్రజలను మోసగించారని అన్నారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మెగా డీఎస్సీ, నిరుద్యోగుల భృతి అమలుకు ప్రజలు ఎదురుచూసి మోసపోయినట్లు గుర్తించారని విమర్శించారు. మైండ్ గేమ్‌తో అధికారంలోకి రావడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. కౌన్సిలర్లు వైజీ బాలాజీ, రఘు రెడ్డి, సందీప్ రెడ్డి, చలపతి పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి

- సర్పంచ్ కొమ్ముదీపిక



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో పంచాయతీని అభివృద్ధి చేస్తామని సర్పంచ్ కొమ్ముదీపిక అన్నారు. శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈవో నరసింహులు అజెండాను చదివి వివరంచారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, తాగునీటి సమస్య తలెత్తకుండా చూద్దామన్నారు. డిగ్రీ కళశాల సమీపంలోని గుజిరి షెడ్డును ఎత్తివేయాలని గతంలో తీర్మానం చేసినా అమలుకు నోచుకోలేదని సభ్యుడు సురేంద్ర కుమార్ తెలిపారు. లింగన్న, సుంకన్న, బండారు నరసింహులు, గ్రామ పంచాయతీ సిబ్బంది చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సమావేశాన్ని అడ్డుకున్న సీపీఐ

పట్టణంలో పదిహేనేళ్లుగా కాపురముంటున్న పేదల కాలనీలో మౌలిక వసతులు కల్పించం లేనది ఆగ్రహం వ్యక్తం చేస్తూ సీపీఐ నాయకులు పంచాయతీ సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకుని నిరసన తెలిపారు. పంచాయతీ గౌరవ సలహాదారులు నాగరత్నమ్మ, ఈవో నరసింహులు కలుగజేసుకుని లఖిత పూర్వకంగా అందజేస్తే పరిష్కారానికి చొరవ చూపుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన కారులు నిరసనను విరమించుకున్నారు.

'పల్లెపండుగ'తో సీసీ రోడ్ల నిర్మాణం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆలూరు పీఆర్ జేఈ చౌడా రెడ్డి



ఆలూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించినట్లు పంచాయతీ రాజ్ జేఈ చౌడా రెడ్డి తెలిపారు.

ప్రశ్న: మండలానికి ఎన్ని పనులు మంజూరయ్యాయి.

జవాబు: ఉపాధి నిధులతో 31 పనులు మంజూరు అయ్యాయి.

ప్రశ్న: మండలానికి ఎన్ని నిధులు మంజూరయ్యాయి.

జవాబు: 16 పంచాయతీలకు రూ.2.42 కోట్లు మంజూరయ్యాయి.

ప్రశ్న: సీసీ రోడ్ల పనులు పూర్తవుతాయి.

జవాబు: నెలాఖరులోగా మొత్తం పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికి 95% పనులు పూర్తయ్యాయి.

ప్రశ్న: నాణ్యత పాటించారా?

జవాబు: నాణ్యత పాటించేలా చూస్తున్నాం. బిల్లులో 50% మాత్రమే చెల్లించి, మిగిలిన 50% బిల్లులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరీక్షించి వారిచ్చే నివేదిక ఆధారంగా మిగిలిన బిల్లును మంజూరు చేస్తాం.

ప్రశ్న: బిల్లులు మంజూరు కాకపోవడంతోనే కంట్రాక్టర్లు పనులు చేసేందుకు ఆసక్తి చూపడం లేదంటున్నారన్నది నిజమా?

జవాబు: మొత్తం పనులు పూర్తయ్యాక ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుంది

ప్రశ్న: గత వైసీపీ ప్రభుత్వం లో చేసిన సచివాలయాల భవనాలు పూర్తయ్యాయా?

జవాబు: ఆలూరు పట్టణంలో రెండు తప్ప, మండలంలోని అన్ని సచివాలయ భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి.

సర్వర్ డౌన్

● రెండు రోజులుగా రిజిస్ట్రేషన్ల కోసం వేచివున్న ప్రజలు
● నేటి నుంచి పెరగనున్న ఫీజులు



జనంతో కిటకిటలాడిన ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం





కోసిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు వేచి ఉన్న ప్రజలు

కోసిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సర్వర్ డౌన్ కావడంతో ఖాళీగా కూర్చున్న సబ్ రిజిస్ట్రార్ బజారి

కోసిగి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సర్వర్ డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మందకొడిగా సాగుతుందని సబ్ రిజిస్ట్రార్ వై. బజారి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ మొరాయిస్తుండటంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలు కార్యాలయాల ముందు పడిగాపులు కాశారు. గురువారం 30 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా, శుక్రవారం 25 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. సర్వర్ మొరాయిస్తుండటంతో పలు డాక్యుమెంట్లు పెండింగ్ పడ్డాయి. శనివారం నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతున్నాయి. దాంతో పలువురు ఆందోళన చెందారు.

ఎమ్మిగనూరు, జనవరి31(ఆంధ్రజ్యోతి): భూముల రిజిస్ట్రేషన్ ధరలను పెంచుతుండడంతో చివరి రోజు రిజిస్ట్రేషన్లు అధికమయ్యాయి. ఎమ్మిగనూరు చుట్టుముట్టు గ్రామాల ప్రజలు, పట్టణానికి చెందిన పలువురు భూమి, స్థలాల కొనుగోలు దారులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు పెద్ద ఎత్తున తరలిరావడంతో కార్యాలయం కిటకిటలాడింది. ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రోజుకు 40 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. అయితే శుక్రవారం మాత్రం రెట్టింపుగా 75 నుంచి 80 వరకు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కొన్ని గంటలు సర్వర్ లేకపోవడంతో రాత్రి 7గంటల వరకు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసులు తెలిపారు.

వాట్సాప్ సేవలను సద్వినియోగం చేసుకోండి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న వాట్సాప్ గవర్నెన్స్ విధానాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి కోరారు. శుక్రవారం తన నివాసంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే మొదటి సారిగా డిజిటల్ టెక్నాలజీ వినియోగంలో అగ్రగామిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాట్సాప్ గవర్నెన్స్ చరిత్రాత్మకంగా ప్రవేశపెట్టారన్నారు. ఇందులో 161 సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 9552300009 నెంబరుకు వాట్సాప్ ద్వారా ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ రకాల సర్టిఫికేట్లు తీసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో సీనియర్ టీడీపీ నాయకులు రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాకేష్‌రెడ్డిలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గోనెగండ్ల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లకు చెందిన దినసరి కూలీ బోయ బొగ్గ రంగస్వామి(45) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గోనెగండ్ల కు చెందిన బోగ్గు రంగస్వామి కొన్నేళ్లుగా విద్యుత్ కాంట్రాక్ట్ పనులలో దినసరి కూలీగా పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. రంగస్వామికి భార్య లక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. అయితే శుక్రవారం విద్యుత్ పనులలో భాగంగా కులుమాల గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ మర్చే సమయంలో ప్రమాదవశాత్తు రంగస్వామి విద్యుదాఘాతానికి గురై తీవ్రగాయాలయ్యాయి. దీంతో అక్కడ ఉన్న తోటి కూలీలు హుటాహుటిన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అయితే మార్గమధ్యంలో మృతి చెందాడు. సీఐ గాంగధర్‌ను వివరణ కోరగా విద్యుదాఘాతానికి రంగస్వామి అనే వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం వచ్చింది. అయితే మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయలేదు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

గోకులం షెడ్ల పరిశీలన

నందవరం, జనవరి 31(ఆథ్రజ్యోతి): మండలంలోని మాచాపురం గ్రామంలో శుక్రవారం ఎంపీడీవో పుల్లయ్య గోకుల షెడ్లను పరిశీలించారు. రెండు షెడ్లను నిర్మించారని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే సీసీ, డ్రైనేజీలను పరిశీలించారు. కాంట్రాక్టర్ నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సందిప్, ఏపీవో శ్రీనివాసులు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కాశీంవలి, చిన్నకొత్తిలి సత్యారెడ్డి, కాట్రాక్టర్ సీతారాముడు పాల్గొన్నారు.

మార్కండేయస్వామి ఆలయంలో పూజలు



నూతన కలశాలకు పూజలు చేస్తున్న భక్తులు

కోసిగి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని మార్కండేయ స్వామి దేవాలయం నూతన గోపుర పూజలు శుక్రవారం పద్మశాలీ సంక్షేమ సేవా సంఘం, యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే అర్చకులు ఈరేష్ స్వామి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నూతన కలశాలకు ప్రత్యేక పూజలతో పాటు దేవతా సహిత శిఖర దేవతలకు రుద్రాభిషేకాలు, మహాసప్తపనము, మహాసుదర్శన హోమం, లక్ష్మీహోమం వంటి పూజలు చేశారు. పద్మశాలీయుల ఆరాధ్యదైవమైన మార్కండేయస్వామి ఆలయంలో గత రెండు రోజుల నుంచి ప్రత్యేక పూజలు చేపడుతున్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

పెద్దకడుబూరు, జనవరి30 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ నిరంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జాలవాడి ప్రధాన రహదారిలో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాతపడుతున్నారన్నారు. హెల్మెట్ ధరించడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం హెల్మెట్ ధరించని ద్విచక్రవహనాదారులకు రూ. 1485 జరిమానా విధించామన్నారు.

విషం కక్కుతున్న వైసీపీ



మాట్లాడుతున్న రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ

గోనెగండ్ల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి వైసీపీ నాయకులు విషం కక్కుతున్నారని రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు మాసాలకే పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. బీసీల కోసం ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 897.79 కోట్లును కేటాయించిందని ఆయన తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో బీసీ కార్పొరేషన్ నిర్వీర్యం అయిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే పూర్వ వైభవం వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాముడు, వెంకటేశ్వర్లు, గోపాల్, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

గోనెగండ్ల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా భావించాలని గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ అన్నారు. శుక్రవారం గోనెగండ్లలోని పలు వీధిలను శుభ్రపరిచారు. కాలువలో నిండిన చెత్తను, ముళ్ల పొదలను తొలగించారు. సతీష్ మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టాలని అందుకు గ్రామాల ప్రజలు కూడా సహకరించాలని కోరారు. వందశాతం పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్ బాషా, అనిల్, సుభాన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి31(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 4,5వ తేదీల్లో మండలంలోని ఏడు గ్రామాల్లో దేవర్ల ఉత్సవాలు ఉన్నాయన్నారు. ఉత్సవాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, అల్లర్లు సృష్టించినా కఠిన చర్యలు తప్పవన్నారు.

నేడు జంబులా పరమేశ్వరి దేవి ఉత్సవాలు

నందవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి గ్రామంలో జంబులా పరమేశ్వరి దేవి ఉత్సవాలు శనివారం నుంచి జరగనున్నటు ఆలయ నిర్వాహకులు టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు, మాజీ జెడ్పీటీసీ ముగతి ఈరన్నగౌడు, గ్రామ పెద్దలు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ 1,2,3 తేదీల్లో ఆలయం ప్రారంభత్సోవంతో పాటు, కలశం, ధ్వజస్తంభం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగనున్నట్లు తెలిపారు.



వాగ్వాదం చేసుకుంటున్న వైసీపీ, టీడీపీ సభ్యులు



మాట్లాడుతున్న టీడీపీ ఫ్లోర్ లీడర్ దయాసాగర్

రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్

ఎమ్మిగనూరు, జనవరి31(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. సమావేశంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ దయాసాగర్ మాట్లాడుతూ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 21వ వార్డులో రోడ్లు, డ్రైనేజీలో పెండింగ్‌లో ఉన్నాయని దీంతో వార్డు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఆ పనులను అధికారులు చేపట్టాలని కోరారు. వెంటనే వైస్‌చైర్మన్ నజీర్ అహ్మద్ కలుగజేసుకొని దయాసాగర్ వార్డుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, కానీ ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి పట్టించుకోవటం లేదని అన్నారు. దీంతో ఫ్లోర్ లీడర్ దయాసాగర్, టీడీపీ సభ్యులు వైస్‌చైర్మన్ నజీర్ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు చెబితే నజీర్ రాజకీయం చేస్తున్నాడంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో సమావేశంలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఎవరు ఏమి మాట్లాడుతున్నారో.. అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇదే సమయంలో ఆరో వార్డు వైసీపీ సభ్యులు రెండో సారి మాట్లాడుతుండగా టీడీపీ సభ్యులు రామదాసు గౌడ్ ఇక చెప్పింది చాలు.. ఎంత సేపు మీ వార్డు సమస్యలేనా.. సోది ఆపి మాకు అవకాశం ఇవ్వాలని అన్నారు. ఇందుకు మిగతా సభ్యులు సైతం వంతు పాడారు. దీంతో టీడీపీ సభ్యులపై చైర్మన్ డా రఘు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా ఎలా మాట్లాడతారు.. వార్డు సమస్యలు మీకు సోదిలా అనిపిస్తున్నాయా.. అంటూ నిలదీశారు. ఎవరి వార్డు సమస్యలు వారు చెప్పాలని, వేలు చూపిస్తు ఎలా మాట్లాడతారని.. సమావేశంలో ఎలా మాట్లాడాలో నేర్చుకోవాలని హితవు పలికారు. టీడీపీ సభ్యులకు పదే పదే అడ్డుతగులుతున్న వైస్‌చైర్మన్ నజీర్‌ను కూ ర్చో వాలని ఇతరులకు అవకాశం ఇవ్వాలని చెప్పి కూర్చోబెట్టారు. అనంతరం టీడీపీ సభ్యులు, వైసీపీ సభ్యులకు మాట్లాడే అవకాశాన్ని కల్పించారు.

● మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో శుక్రవారం చైర్మన్ డా రఘు అధ్యక్షతన కౌన్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభమైన కొద్ది సేపటికి వైస్‌చైర్మన్ నజీర్ అహ్మద్ అజెండాలోని 42, టేబుల్ అజెండాలోని 4అంశాలను ఆమోదిస్తున్నామని చెప్పి ఆమోదించారు.

● ఆరోవార్డు వైసీపీ కౌన్సిలర్ శివప్రసాద్, 22వ వార్డు కౌన్సిలర్ కేశవరెడ్డి, తొమ్మిదో వార్డు వైసీపీ కౌన్సిలర్ రాజరత్నం, 14వ వార్డు కౌన్సిలర్ కాశీంబేగ్, 15వ వార్డు, 5వ వార్డు టీడీపీ సభ్యులు ఇసాక్, అమాన్‌లు మాట్లాడుతూ వార్డులో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. టీడీపీ ప్రభుత్వంలోనే పట్టణంలో రోడ్లు డ్రైనేజీలు ఏర్పాటు చేశారన్నారు.

● సమస్యలపై మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి స్పందిస్తూ అసంపూర్తిగా ఉన్న యూజీడీ పనులు పూర్తి చేసేందుకు రూ. 13కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, అవి వస్తే పనులు పూర్తి చేస్తామన్నారు. అలాగే తాగునీటి సమస్యలేకుండా ఎమ్మెల్యే సహకారంతో పులికనుమ నుంచి నీటిని తెచ్చుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు డ్యాన్స్ మాస్టర్‌కు సన్మానం



డ్యాన్స్ మాస్టర్ బన్నిని సన్మానిస్తున్న నటుడు సంపూర్ణేష్ బాబు

ఎమ్మిగనూరు, జనవరి31(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన డ్యాన్స్ మాస్టర్ బన్నిని అనంతపురం పట్టణంలో పలువురు ప్రముఖులు ఘనంగా సన్మానించారు. అనంతపురం పట్టణంలో ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ హరి ప్రసాద్ డ్యాన్స్ శిక్షణ ప్రారంభించి 25ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా టీటీడీ కల్యాణ మండలంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డ్యాన్స్ మాస్టర్ బన్నిని ప్రముఖ నటుడు, హీరో సంపూర్ణేష్ బాబు, ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి, సుప్రీంకోర్టు న్యాయవాది పద్మజ, డాక్టర్ హరిప్రసాద్ ఘనంగా సన్మానించారు. డ్యాన్స్ మాస్టర్‌గా బన్ని కర్నూలు జిల్లాలోను, అనంతపురం లోను విద్యార్థులకు డ్యాన్స్ శిక్షణ ఇస్తున్నారు.

శాంతిభద్రతలు మెరుగుపడాలి

మంత్రాలయం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో శాంతి భద్రతలను మెరుగుపర్చాలని జనసేన మంత్రాలయం నియోజకవర్గం ఇన్‌చార్జి బి.లక్ష్మన్న కోరారు.శుక్రవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ శివాంజల్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బీవీ రవిచంద్ర, వెంకటేశ్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు

మంత్రాలయం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ప్రధాన రహదారిలో ఇరువైపులా ఆర్‌అండ్‌బీ స్థలాల్లో తోపుడు బండ్లు, పూలు, పూజాసామగ్రి, సోడా బండ్లు, ఆటోలు పెట్టుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివాంజల్ హెచ్చరించారు. శుక్రవారం ప్రధాన రహదారిలో ఉన్న తోపుడుబండ్లను సోడా బండ్లను తొలగించారు. మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. ఎవరైనా ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించుకుని పానీపూరి, సోడాబండ్లు, టిఫిన్, హోటళ్ల ముందు లాడ్జీ ముందు కార్లు పార్కింగ్ చేస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించమని హెచ్చరించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, జనవరి31(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను అమలు చేయాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో సీఐటీయూ తాలుకా కార్యదర్శి తిమ్మగురుడు, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా తీసుకు వచ్చిన నాలుగు చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, అసంఘటిత కార్మికులు కూడా పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను అమలు చేయాలన్నారు. ఈనెల 5న కార్మిక సంఘాలు చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బజారి, రాజు, నరసింహులు, సుంకన్న పాల్గొన్నారు. అనంతరం పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వీరేష్, గౌరవ అధ్యక్షుడిగా దాదావలి, అధ్యక్షుడిగా నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఈరన్న, శివ, రంగస్వామి, కార్యదర్శిగా విజయేంద్ర, సహాయ కార్యదర్శులుగా వీరాంజనేయులు, లోకేష్, అమృత, సుంకన్న, కోశాధికారిగా నరసింహంగౌడు, కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలి



కోసిగి తహసీల్దార్ కార్యాలయం వద్ద . ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కోసిగి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పేదలు కట్టుకునే ఇంటి నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయాలని, అలాగే పేదలకు పట్టణంలో 2 సెంట్లు, పల్లెల్లో 3 సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కోసిగి తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ మండల కార్యదర్శి గోపాల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్ఐ శ్రీరాములుకు అందజేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, ఏఐవైఎఫ్ నాయకులు జీవన్, చిన్న, ప్రకాష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్, మూకప్ప, ఓంకారస్వామి, పరుశురాం ఉన్నారు.

జంపాపురంలో నూతన ఆలయాలు ప్రారంభం



సుంకులమ్మ నూతన దేవాలయంలో హోమాలు చేస్తున్న గ్రామస్థులు

కోసిగి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జంపాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సుంకులమ్మ, రామక్కవ్వ దేవతామూర్తుల నూతన ఆలయాలను శుక్రవారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. రెండు రోజులుగా వేద పండితుల ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు. దేవాలయాల్లో హోమాలు, పూజలు అమ్మవార్లకు చేశారు. సుంకులమ్మ, రామక్క దేవాలయంలో అమ్మవార్లకు కుంకుమార్చనలు, ప్రత్యేక పుష్పాలంకరణ, మహా మంగళహారతి పూజలు చేశారు. టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డితో పాటు టీడీపీ నాయకులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు కార్యక్రమంలో గ్రామ పెద్దలు సీతారామిరెడ్డి, మాజీ సర్పంచ్ బసప్ప, పురుషోత్తం, బసవరాజు, బాగి ఈరన్న, తుమ్మలబీడు రంగారెడ్డి, సుంకన్న, చిదానంద, టీడీపీ నాయకులు జ్ఞానేష్, నాడిగేని అయ్యన్న, వక్రాణి వెంకటేశ్, నాడగేని చిన్నతాయన్న, చింతలగేని నర్సారెడ్డి, నరసింహులు, ఈరన్న, చింతకుంట తాయన్న, భక్తులు పాల్గొన్నారు.

6న మండల సమావేశం

కౌతాళం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 6న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ అమరేశ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు. ఆయా శాఖల అధికారులు కూడా పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

ఉపాధి పనులు చేపడతాం

నందవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వలసలు నివారించి గ్రామంలో ఉపాధి పనులు చేపడతామని ఎంపీడీవో పుల్లయ్య తెలిపా రు. శుక్రవారం కనకవీడు, ముగతి, నందవరం గ్రామాల్లో ఉపాధి పనులపై ఏపీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి కూలీకి రూ. 300 కూలి పడుతుందని పనులకు రావాలన్నారు. పిల్లపాపలను వదలి సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లవద్దని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సందిప్, పంచాయతీ కార్యదర్శి, టిఏ, ఎఫ్ఏ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: గ్రామాలలో ఉపాధి పనులు కల్పిస్తున్నాం, వలసలు వెళ్లొద్దని ఎంపీడీవో మణిమంజరి కోరారు. శుక్రవారం సాయంత్రం గంజహళ్లి గ్రామంలోని ఉపాధి కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వలసలు వెళ్తే అక్కడ జరిగే ఇబ్బందులను గురించి కూలీలకు వివరించారు. అక్కడ వచ్చే కూలిలే ఇక్కడ కూడా వస్తాయని వలసల వల్ల మీపిల్లల చదువు దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ అనంతశయన, ఎపీవో మహమ్మద్ బాషా, టీఏ ఉస్మాన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

గోనెగండ్ల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం అయిన వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినాన్ని కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంపై గోనెగండ్ల మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు సత్య, కృష్ణకుమార్, రామసబ్బయ్య, చిత్రాల రాజు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని వీరభద్రస్వామి దేవాలయంలో ఆర్యవైశ్యుల సంఘం సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబునాయుడు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పెద్దకడుబూరు, జనవరి30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు, ఐటి శాఖ మంత్రి నారాలోకేశ్ సారథ్యంలో ప్రజల చేతుల్లోనే పాలనకు శ్రీకారం చుట్టారని, ప్రపంచంలోనే ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తుందని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు బొగ్గుల తిక్కన్న అన్నారు. శుక్రవారం పెద్దకడబూరులో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నారాలోకేశ్ యువగళం పాదయాత్ర ద్వారా తెలుసుకొని ప్రజల చేతుల్లోనే పాలన తీసుకోరావాలన్న ఆలోచనే వాట్సప్ గవర్నెన్స్ అన్నారు. దీని ద్వారా వేగంగ పౌరసేవలు, పారదర్శకత, జవాబుదారీతనంలో భాగంగా వాట్సప్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు.

ఇద్దరు వ్యక్తులు అరెస్టు



కర్ణాటక మద్యం, కారుతో నిందితులను చూపుతున్న సీఐ, ఎస్ఐలు

మంత్రాలయం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం చెక్‌పోస్టు గుండా కారులో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం పట్టుకున్న కేసులో రచ్చుమర్రి చెందిన బోయ కడతట్ల శివ, బోయ మజ్జిగ అయ్యన్నలను అరెస్టు చేయగా.. అదే గ్రామానికి చెందిన డ్రైవర్ బోయ మజ్జిగ రామకృష్ణ పరారైనట్లు మంత్రాలయం సీఐ రామాంజులు, మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. గురువారం కర్ణాటక మద్యం కేసులో 15 బాక్సులలో కర్ణాటకకు చెందిన 1440 కర్ణాటక 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను సాధీనం చేసుకోగా.. నిందితులు పరారైన విషయం తెలిసిందే. శుక్రవారం ఇద్దరిని అరెస్టు చేసి ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపరిచి ఆదోని సబ్‌జైలుకు తరలించారు. కారు డ్రైవర్ రామకృష్ణ పరారీలో ఉన్నాడు. కారు సీజ్ చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురుపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ వీరేష్, సోమశేఖర్, రామకృష్ణ, రాఘవేంద్ర, తదితరులున్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో వ్యాసరాజ మఠం పీఠాధిపతి



పీఠాధిపతికి స్వాగతం పలుకుతున్న మఠం సిబ్బంది

మంత్రాలయం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామిని కర్ణాటకలోని సోషలే వ్యాసరాజ మఠం పీఠాధిపతి విద్య మనోహర తీర్థులు శుక్రవారం దర్శించుకున్నారు. పీఠాధిపతికి వేద పండితుల మంత్రోచ్ఛారణాల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహ మూర్తి,ఆనంద్ తీర్థ ఆచార్, విద్యపీఠం ప్రిన్సిపాల్ రమణరావు, నరసింహ దేశాయ్, డోన్ రాఘవేంద్ర ఆచార్, జయతీర్థ ఆచార్,విజయేంద్ర ఆచార్‌లు పాల్గొన్నారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథం విహారించారు. శుక్రవారం బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని స్వర్ణ రథంపై ఊరేగించారు.

ఉడిపి శ్రీకృష్ణుడ్ని దర్శించుకున్న మంత్రాలయం పీఠాధిపతి

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఉడిపిలోని శ్రీకృష్ణ భగవానుడు ముఖ్యప్రాణదేవుడైన ఆంజనేయస్వామి, ఆచార్య మధ్వస్వామిని శుక్రవారం దర్శించుకున్నారు. ధర్మస్థలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాఠశాలను ప్రారంభించారు. అనంతరం మఠం పీఠాధిపతికి మెమెంటో, పట్టు శాలువ, నగదు, ఫల పుష్పాలు ఇచ్చి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్, పవనాచార్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.